


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 26-01-2021 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 116 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం



దిల్లీ: 'ఏక్ భారత్- శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో 'వోకల్ ఫర్ లోకల్' కార్యక్రమాన్ని బలోపేతం చేయాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు నిచ్చారు. కళాకారులు, ఎన్‌సీసీ క్యాడెట్లతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మోదీ ఈ మేరకు వెల్లడించారు. "ప్రజలు తాము నిత్య జీవితంలో స్వదేశీ ఉత్పత్తుల ఉపయోగంపై దృష్టి సారించాలి. అదే సమయంలో తమ జీవితాల్లోకి విదేశీ వస్తువులు ఎంత మేర వచ్చాయోనన్న విషయాన్ని పరిశీలించుకోవాలి. ఆయా వస్తువులకు మానసికంగా బానిసలవుతున్నామనే విషయాన్ని మనం గుర్తించాలి. యువత తలచుకుంటే భారత్ సులువుగా స్వశక్తి ఆధారిత దేశంగా మారుతుంది. కేంద్రం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఆత్మనిర్భర్ భారత్' విజయం కూడా దేశ యువతపైనే ఆధారపడి ఉంది" అని మోదీ అన్నారు. "దేశంలోని శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఎంతో శ్రమించి కరోనా వైరస్‌కు టీకాను రూపొందించి తమ కర్తవ్యాన్ని పూర్తి చేశారు. ఆ టీకాను

## ఏపీలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సిందే

### పంచాయతీ ఎన్నికలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు



దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠ వీడింది. పంచాయతీ ఎన్నికలు యథావిధిగా నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టి వేసింది. ఎన్నికల నిర్వహణకు అనుమతిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్

తరువాయి 2లో..

## గవర్నర్ నుండి అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్




విశాఖపట్నం : జిల్లాలో అధిక సంఖ్య లో వోటర్లను నమోదు గావించడములో విశేష కృషి చేసినందుకు జిల్లా కలక్టరు వి. వినయ్ చంద్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నరు విశ్వ భూషన్ హరిచందన్ చేతుల మీదుగా సోమవారం రాజభవన్ దర్బార్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. తన నాయకత్వ ప్రతిభతో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేసి ఓటర్ల జాబితాలో సవరణలకు సంబంధించిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించడం, జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించినందుకు ఈ అవార్డును అందుకున్నారు.త

## పంచాయతీ ఎన్నికల పూర్తి షెడ్యూల్

అమరావతి: పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం రీ షెడ్యూల్ చేసింది. రెండో దశ ఎన్నికలను తొలి దశగా మారుస్తూ రీ షెడ్యూల్ ప్రకటించింది. మూడో దశ ఎన్నికలను రెండో విడతగా, నాలుగో దశ ఎన్నికలను మూడో విడతగా ఎస్‌ఈసీ మార్పు చేసింది. మొదటి దశ ఎన్నికలను నాలుగో విడతగా మార్చింది. ఎన్నికల ఏర్పాట్లు పూర్తికానందున రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది.



**తొలి దశ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్**

- జనవరి 29 నుంచి నామినేషన్ల స్వీకరణ
- జనవరి 31 నామినేషన్ల దాఖలుకు తుది గడువు
- ఫిబ్రవరి 1న నామినేషన్ల పరిశీలన
- ఫిబ్రవరి 2న నామినేషన్లపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన
- ఫిబ్రవరి 3న అభ్యంతరాలపై తుది నిర్ణయం

తరువాయి 2లో..

## సమగ్ర వివరాలతో సిద్ధం కావాలి

### వైఎస్సార్‌సీపీ ఎంపీలతో సీఎం వైఎస్ జగన్ సమావేశం



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పార్టీ పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, వంగా గీత, గొడ్డేటి మాధవి సహా ఇతర ఎంపీలు పాల్గొన్నారు. ఈనెల 29 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహంపై సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రత్యేక హెూదా

తరువాయి 2లో..

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

### 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ గా నమోదు చేసుకోవాలి

### సబ్ కలెక్టర్ ఎన్.మౌర్య విజ్ఞప్తి




విశాఖపట్నం : ఓటు అనేది మన భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అనీ, ఈ సం. జనవరి 1 వ తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకులు తమ ఓటును నమోదు చేసుకోవాల్సిందిగా నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్ మౌర్య విజ్ఞప్తి చేశారు. సోమవారం 11 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నర్సీపట్నం శ్రీ కన్య థియేటర్ జంక్షన్ నుండి అబిద్ సెంటర్ వరకు విద్యార్థినీ విద్యార్థులతో ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్ మౌర్య ప్రారంభించారు. అబిద్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 1950 వ సం జనవరి 25 వ తేదీన ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చట్టసవరణ చేయడం జరిగిందన్నారు. 18 సం.లు నిండిన వారిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు 2011 సంవత్సరం , జనవరి 25 నుండి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటు న్నామన్నారు. పంచాయితీ ఎన్నికల నుండి పార్లమెంట్ ఎన్నికల వరకు భారత పౌరుడిగా తమ విలువైన ఓటు హక్కును మంచి పరిపాలన అందించే నాయకులను ఎన్నుకునేందుకు వీలుగా యువతకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈరోజు కేంద్ర ఎన్నికల కమిషన్ ఎలక్ట్రానిక్ యాప్ , పోర్టల్ ద్వారా నూతనంగా ఈ- ఎపిక్ కార్డు ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నదన్నారు. నేటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ మొబైల్ / కంప్యూటర్ లో వెబ్ సైట్ ద్వారా ఈ-ఎపిక్ కార్డ్ కు నమోదు చేసుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరికి జాతీయ ఓటరు దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు.

ఎన్నికల ప్రత్యేక డిప్యూటీ తాసిల్దార్ సూర్య నారాయణ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది మన భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కు

తరువాయి 2లో..

## ప్రజారోగ్యం కోసమే కోర్టుకు వెళ్ళాం

### • కోర్టు తీర్పును గౌరవిస్తాం • డెప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట : ప్రజారోగ్యం కోసమే తాము కోర్టుకు వెళ్ళామని, సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తామని డిప్యూటీ సీఎం, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఎన్నికలను ఏ దశలో ఆపారో, అక్కడ నుంచి మొదలు పెట్టక పోవడంతోనే ఎన్ ఈ సీ దురుద్దేశం కనిపిస్తోందని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూటికి నూరు శాతం విజయం సాధిస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వ యంత్రాంగం ముందుకెళు ్తందని వివరించారు. ప్రాణాలకు తెగించి ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహించాలన్న విషయాన్ని ఎన్నికల సంఘం గమనించలేదని, రెండు నెలల్లో పరిస్థితి అదుపులోకి వస్తుందని ఎదురు చూశామని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎవరి స్వలాభం కోసం ఎన్నికల సంఘం పనిచేస్తుందో తెలుస్తుందని, ప్రభుత్వంతో చర్చించాలన్న ఆలోచన ఇప్పటికీ ఎస్ఈసీకి లేద న్నారు. ఎన్నికల పక్రియలో ఉద్యోగులకు, ప్రజలకు ఏదైనా జరిగితే ఎస్ఈసీ పూర్తి బాధ్యత వహించాలని కృష్ణ దాస్ అన్నారు.

## కొత్తగా లక్ష కోట్లతో నేషనల్ బ్యాంక్

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: వచ్చే బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. కొత్తగా ఓ నేషనల్ బ్యాంక్ ఏర్పాటు ప్రకటన చేయనున్నట్లు ప్రముఖ మీడియా సంస్థ సీఎన్‌బీసీ వెల్లడించింది.

దేశంలో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లకు తక్కువ వడ్డీ రుణాలు ఇవ్వడానికే ప్రత్యేకంగా ఈ బ్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పింది. అంతేకాదు ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, ఇన్సూరెన్స్ ఫండ్స్ కొంత మొత్తాన్ని కచ్చితంగా ఈ బ్యాంక్‌లో

తరువాయి 2లో..

## విజయవంతంగా ఆకాశ్ NG క్షిపణి పరీక్ష



న్యూఢిల్లీ: భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అకాశ్-NG (న్యూ జనరేషన్) క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. సోమవారం మధ్యాహ్నం ఒడిశా తీరంలోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ఈ క్షిపణి పరీక్ష నిర్వహించారు. ఆకాశ్-NG అనే ఈ కొత్త తరం క్షిపణి.. భారత వాయుసేన ఉపరితలం నుంచి గగన తలంలోని శత్రుదేశాలకు సంబంధించిన టార్గెట్‌లను చేధించడానికి తోడ్పడుతుంది. ఈ క్షిపణి పరీక్షలో అకాశ్ మిస్సైల్ తన లక్ష్యాన్ని అత్యంత కచ్చితమైన టైమింగ్‌తో చేధించింది. క్షిపణిలోని కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్, ఆన్‌బోర్డ్ ఏవియోనిక్స్ అండ్ ఏయిరోడైనమిక్ కాన్ఫిగరేషన్ సమర్థంగా పనిచేశాయి.




# గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ విద్యా దినం



విశాఖపట్నం : ప్రతి ఏటా జనవరి నెల 26 వ తేదిన ''అంతర్జాతీయ పర్యావరణ విద్యా దినం'' జరుపుకుంటారు. 1972వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం లో ఇటువంటి ఒక రోజును ప్రతిపాదించి ప్రపంచ ప్రజలందరికి పర్యావరణాపైన, దాని పరిరక్షణపైన అవగాహన కల్గించాలనే ఉద్ధేశ్యంతో రూపొందించబడింది. దీనిని దృష్టిలోనికి తీసుకుని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఈరోజు విశాఖపట్నంలోని కె.డి.పి.మ్ హైస్కూల్‌లో అంతర్జాతీయ పర్యావరణ విద్యా దినం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో సస్టయినబుల్ రెసిల్లియన్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (యు.ఎన్.డి.పి. - జి.వి.ఎమ్.సి) ఎమ్. ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ విద్య అనేది మన చుట్టూ ఉన్న పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేసే అవకాశాన్ని కల్పిస్తుంది. అంతేకాకుండ పర్యావరణ పరంగా ఎదురవుతున్న విపత్తులు, మానవ చర్యల వల్ల పెరుగుతున్న కాలుష్యం దానివల్ల కలుగుతున్న సమస్యలు పర్యావరణ హితంగా జీవించడానకి అవసరమపైన విధానాలు తెలుసుకునేందుకు ఈ రోజు ఉపయోగపడుతుంది. గాలి, నీరు, భూమి, ఆహారం, సముద్రం విషతుల్యం అయిపోతున్నాయని అన్నారు. నేడు అనేక రూపాలలో కాలుష్యం విడుదలవుతుంది. విశ్వ వ్యాప్తంగా 80% వ్యాదులు కేవలం కాలుష్యం వల్లే వ్యాప్తి చెందుతున్నాయి. ప్రస్తుత తరాలు ఈ నష్టాలను చూస్తునాయ్ భవిష్యత్ తరాలకు ముప్పు పొంచి వుంది. అని అనేక మంది శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు, ఇటువంటి పరిస్థితులలో పర్యావరణ సమస్యలు, కాలుష్య కారకాల గురించి చైతన్యం పొందడం చాలా అవసరం అందుకు ఈ పర్యావరణ విద్య దినం ఉపయోగకరంగా వుంటుందని ఆమె అన్నారు.

జి.వి.ఎమ్.సి. స్కూల్స్ సూపర్‌వైజర్ సాంబశివరావు మాట్లాడుతూ పర్వారణ విద్య అనేది సహజ వాతావరణ పరిస్థితులు, జీవవైవిద్య పరిస్థితులను వివరించడానికి వుపయోగపడుతుంది అంతేకాకుండా వీటి పరిరక్షణంలో మానవుని పాత్రను విశదీకరిస్తుంది. జీవశాస్త్రం, రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, జీవావరణశాస్త్రం, భూశాస్త్రం, వాతావరణశాస్త్రం, గణితశాస్త్రం, భూగోళశాస్త్రం, వంటి పలు విభాగాలు సమన్వయంగా గల శాస్త్రమే ఈ పర్యావరణ విద్యలో భాగంగా ఉంది. ఈ పర్యావరణం అనే పదం ప్రాధమిక స్థాయి విద్య నుండి ఉన్నత స్థాయి విద్య వరకు అందరికి సుపరిచితమైనదేనని అన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలకు పర్యావరణ విద్య మిద అవగాహన కల్పించాలంటే చిన్నచిన్న ప్రాజెక్ట్ వర్కల ద్వారా, ఫీల్డ్‌ట్రిప్‌ల ద్వారా కలుగజేయవచ్చు విద్యాలయాల్లో ఈ రకామైన పర్యావరణ అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చిన్ననాటి నుండే మనచుట్టూ ఉన్న సహజ వనరులను, జీవవైవిద్యాన్ని కాపాడుకోవాలనే ఆలోచనను మొలకెత్తిస్థాయి. అందుకే విద్యాలయాల్లో పర్యావరణ విద్యను, తప్పనిసరిగా అందించినపుడు వారి జీవితాలలో సుస్థిరత సాధించే అవకాశం పర్యావరణ విద్య అనేది చాలా రకాలుగా తెలుసుకోవచ్చు.కేవలం పాఠ్యాంశంగానే కాకుండ పరిసరాల పరిశీలన జీవవైవిద్య క్షేత్రాల పర్యావరణ ఉద్యాన వనాలు వంటి వాటిని సందర్శించడం ద్వారా, పర్యావరణానికి సంబంధించిన ఇతర పర్యావరణ దినాలను ఆచరించడం ద్వారా కూడ పర్యావరణానికి సంబంధించిన అనేక విషయాలను గూర్చి తెలుసుకోవచని అన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ కపుల్స్ డైరెక్టర్ పి. సుధారాణి మాట్లాడుతూ భవిష్యత్తు తరాలూ, సమస్త జీవవైవిద్యం గూర్చి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. పర్యావరణ విద్య అనేది మొక్కుబడిగా కాకుండా ప్రతి విద్యార్థి పూర్తి స్థాయిలో అవగాహన కలిగించుకుని తమ భవిష్యత్తు జీవనం గూర్చి తెలుసుకునేలా ఉండాలి. ప్రకృతిలో జీవించే మనిషి ఆ ప్రకృతిని నాశనం చేసుకుంటూ మనుగడ సాగించడం అసాధ్యం అన్నది జగమెరిగిన సత్యం దీని గురించి పూర్తి స్థాయి అవగాహన కలిగించేదిగా పర్యావరణ విద్యఉండాలని, దానికిసైతం ఉత్తీర్ణత విషయంలో మిగిలిన సబ్జెక్టలతో సమానంగా గుర్తింపు ఇవ్వాలి. ఇందుకు ప్రపంచ వ్యాప్తతంగా ఐక్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలసిన అవసరం వుంది. ఏందుకంటే ఆధునిక యుగంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధన్యం తగ్గింది. ఆధునికత పేరున మానవుని అవసరాలు పెరుగుతు వచ్చాయి. దినితో ప్రకృతి పై భారం ఎక్కువ కాసాగింది. సహజ వనరుల వినియోగం కూడా ఎక్కుగా పెరిగిపోయింది. మానవుని జీవణ సరలీ, అవసరాలు పరిశ్రమలు ఎక్కువగా నెలకొల్పడానికి ప్రాదాన్యత పెరిగింది. పరిశ్రమల నుండి వెలువడుతున్న వ్యర్థాలు జలవనరులను కలుషితం చేస్తున్నాయని ఆమె అన్నారు.

భూమి మీదా వున్న మానవులందరికి మంచి పర్యావరణంలో జీవించడం ప్రాధమిక హక్కు మన చుట్టు ఉన్న సహజవనరులని కాపాడుకోవడం మన అందరి బాధ్యత. ఈ బాధ్యతను గర్తించడానికి అవసరమైనా విద్యను అందరికి అందించవలసిన అవాస్యకత ఏంతైనా వుంది.

ఈ కార్యక్రమంలో కె.డి.పి.ఎమ్. స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ తిరుమల శ్రీదేవి, గ్రీన్ క్లైమేట్ టీమ్ అధ్యక్షులు జె.వి. రత్నం అంతర్జాతీయ పర్యావరణ విద్యా దినం ఆవశ్యకతను తెలియజేసారు.

## శతశాతం ఓటింగ్ ద్వారా మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చు



శ్రీకాకుళం : శతశాతం ఓటింగ్ ద్వారా మంచి సమాజాన్ని నిర్మించుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె.నివాస్ పేర్కొన్నారు. సోమవారం 11వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయం నుండి బాపూజీ కళామందిర్ వరకు భారీ రాలీ జరిగింది. జిల్లా కలెక్టర్ జె.నివాస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మన దేశం ప్రజాస్వామ్య దేశమని, ఓటింగ్ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి పునాది అని, రాజ్యాంగం ప్రసాదించిన ఒక వరమని అన్నారు. 18 సం.లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలన్నారు. మంచి నాయకుల ఎంపిక ఓటింగు ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. ఓటు హక్కు కలిగిన వారంతా బాధ్యతతో ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. మంచి నాయకులను ఎన్నుకుని ఒక మంచి సమాజ నిర్మాణానికి పునాదులు వేయాలన్నారు. ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా 1952 వ సం.లో ఏర్పాటు అయ్యిందని తెలిపారు. ఒక్కప్పుడు 17 శాతం ఓటింగ్ జరిగిందని, ఇప్పుడు ప్రజలలో మంచి చైతన్యం వచ్చిందన్నారు. 2019 ఎలక్షన్ లో 80 శాతం ఓటింగ్ జరిగిందన్నారు. ఇది ఒక మంచి పరిణామమని అన్నారు. ఇక ముందు శతశాతం ఓటింగ్ జరగాలన్నారు. 2019 లో నోటా ఓటింగ్ ను ప్రవేశ పెట్టడం జరిగిందని, ఎన్నికలలో పాల్గొన్న అభ్యర్థులపై విశ్వాసం లేనట్లయితే నోటా ఓటు ద్వారా తిరస్కరించవచ్చునని తెలిపారు.

సుమార్ వెయ్యి నుండి 15 వేల మంది నోటా ఓటును 2019 ఎన్నికలలో వినియోగించుకోవడం జరిగిం దన్నారు. ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా, ఎపిక్ (EPIC) ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో ఆన్ లైన్ ద్వారా ఓటును నమోదు చేసుకునే సౌలభ్యాన్ని కలిగించారని కావున యువత ఈ ప్రక్రియ ద్వారా తక్షణమే ఓటును నమోదు చేసుకుని, ఓటు హక్కును శతశాతం సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సుమీత్ కుమార్, ట్రైనీ కలెక్టర్ నవీన్ కుమార్, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి రెవిన్యూ డివిజనల్ అధికారి ఐ.కిషోర్, నగర పాలక సంస్థ కమీషనరు పి.నల్లనయ్య, సచివాలయ సిబ్బంది, ఎన్.సి.సి. విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు సాధికారత తో అప్రమత్తతో ఉండాలి



ములగాడ: ప్రతి ఓటరు సాధికారతతో, సరి అయిన సమాచారంతో , నిర్భయంగా తన ఓటు హక్కును వినియోగించు కోవాలని సెయింట్ అన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గేసిల్లా అన్నారు. స్థానిక సెయింట్ అన్స్ కళాశాలలో సోమ మరం నిర్వహించిన ''ఓటర్ల దినోత్సవం '' లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ యువ ఓటర్లు ఓటు అమలుపట్ల ఆసక్తి కనబరచాలని, ప్రలోభాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించాలని అన్నారు. సరి అయిన నాయకులను ఎన్నుకోవడం పైన ప్రజాస్వామ్య విజయం , దేశాభివృద్ధి ఆధారపడి ఉంటాదాని ఆమె అన్నారు . సశం లో గౌరవ అతిభగా పాల్గొన్న సెయింట్ అన్స్ జునియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్ ప్రసంగిస్తు - 1988 లో 61వ, రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కును 18సం తగ్గించారని అన్నారు. అనంతరం భారత ఎన్నికల సంఘం - ఎన్నికలు అనే అంశంపై క్విజ్ పోటీ ని నిర్వ హించి, బహుమతులను, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో జాతీయ సేవ పథకం జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇ పి ఎస్ భాగ్యలక్ష్మి, వై. అనసూదేవి, అధికసంఖ్యలో యువత పాల్గొన్నారు.

## కొత్తగా లక్ష కోట్లతో నేషనల్ బ్యాంక్

మొదటి పేజీ తరువాయి

డిపాజిట్ చేయాలన్న షరతు కూడా విధించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఈ బ్యాంక్ క్యాపిటల్ రూ.లక్ష కోట్లు కాగా.. మొదట రూ.20 వేల కోట్లతో ప్రారంభించనున్నట్లు సీఎన్‌బీసీ తన రిపోర్ట్‌లో తెలిపింది. ఈ బ్యాంక్‌ను ఓ ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు కూడా ఆ రిపోర్ట్ స్పష్టం చేసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన ముసాయిదా బిల్లును నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ బిల్ 2020 పేరుతో రూపొందించింది. ఇప్పటికే ఉన్న ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను ఇది రీప్లేస్ చేయనుంది.

## గాజువకలో ఎస్‌డిసి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వినతి



గాజువాక: ఉక్కు నిర్వాసితుల సమస్యలు పరిస్కారనికి, అర్ కార్డుల బదిలీలకు నగరంలో ఏర్పాటు చేసిన ఎస్ డి సి (ఉక్కు డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం)ని గాజువాక కు తరలించాలని 87వ వార్డు వైకాపా కార్పొరేటర్ అభ్యర్థి ప్రగడ విజయలక్ష్మి, ప్రగడ వేణుబాబు ఆధ్వర్యంలో నిర్వాసితుల ప్రతినిధులు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే ను కలిసి, సమస్య ను వివరించి వినతిపత్రాన్ని అందజేసి అనంతరం వారు మాట్లాడుతూ విశాఖపట్నం ఉక్కు నిర్వాసితుల కాలనీ (వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ, నడుపూరు, పెదగంట్యాడ, గంగవరం, )లో ఉన్న నిర్వాసితులు ఆర్ కార్డ్ ల బదిలీలకు గాని, నిరభ్యంతర ధ్రువ పత్రం గురించి గాని స్టీల్ డెప్యూటీ కలెక్టర్ (ఎస్ డి సిఆఫీస్) కార్యాలయం నకు వెళ్లాలంటే చాలా దూరం గా ఉండటం వలన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎస్ డి సి ఆఫీస్ గాజువాక ప్రాంతానికి తరలించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ని కోరుతూ వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి స్పందించి ఆఫీస్ తరలించే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న 87వ వార్డు సీనియర్ వైస్సార్సీపీ నాయకులు ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, గాలి ఆనంద్, గుర్రం శ్రీను,ఇల్లపు రాము, ప్రగడ శ్రీనివాస్, ఆడారి శ్రీను, కొన్న నారాయణ, బోండా గోవిందా రాజులు, మార్పు గోవిందా, శ్రీను గెద్దాడ ఈశ్వర్ రావు, సబ్బవరపు ఈశ్వర్ రావు, సీరం పాపారావు, దాసరి అప్పడు గిరాడ అప్పన్న, ఎస్. వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

వేయించుకొని ప్రజలు తమ బాధ్యతను నిర్వర్తించాలి. తప్పుడు ప్రచారాల్ని వ్యాప్తి చేసే వారిని మనం సరైన సమాచారంతో ఓడించాలి. కరోనా వైరస్‌కు వ్యతిరేకంగా చేపట్టిన వ్యాక్సినేషన్ ప్రక్రియ విజయవంతం అయ్యేందుకు అందరూ ముందుకు వచ్చి సహకరించాలి. దేశ అభివృద్ధి కోసం ఉన్నతంగా శ్రమించాలి'' అని మోదీ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్థిక వ్యవస్థల్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం వోకల్ ఫర్ లోకల్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.

**ఆత్మనిర్భర్ భారత్‌లో యూపీ పాత్ర కీలకం**

ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ఉత్తరప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని మోదీ పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆయన ఈమేరకు ట్వీటర్ ద్వారా వెల్లడించారు. 'ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు. ఈ నేల సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం. ఈ రోజు ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోంది' అని వెల్లడించారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



అనీ నిష్పక్షపాతంగా కుల , మత, వర్గ, పార్టీలకతీతంగా సుపరిపాలన అందించే నాయకులను ఎన్నుకోవాలనీ, జరిగే ప్రతి ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకావాలన్నారు.18 సంవత్సరాలు నిండినవారు ఆన్ లైన్ లో గాని, తాసిల్దారు / సబ్ కలెక్టర్ కార్యాలయంలో గాని పేర్లను నమోదు చేసుకొవచ్చునని, లేదా ఈ -పోర్టల్ ద్వారా ఎపిక్ కార్డును పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ పికాంతారావు , మండల తాసిల్దార్ జయ, మునిసిపల్ , రెవెన్యూ కార్యాలయ అధికారులు , పోలీస్ , వార్డు సచివాలయ సిబ్బంది, పలు కళాశాలల విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు.

## వైఎస్సార్ సీపీ ఎంపీలకు సీఎం జగన్ దిశా నిర్దేశం

వంటి అంశాలపై ఈ సందర్భంగా కీలక చర్చ జరిగింది. ఇక పార్లమెంటరీ సమావేశం ముగిసిన అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. పోలవరం నిధులు, ప్రత్యేక హెూదా అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని తెలిపారు. అదే విధంగా... నివర్ తుపాను నష్టపరిహారం విడుదల చేయాలని కోరతామని పేర్కొన్నారు. ''కర్నూలుకు హైకోర్టు తరలింపు అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం. రాష్ట్ర రెవెన్యూ లోటును పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్తాం. విశాఖ రైల్వే జోన్ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం'' అని తెలిపారు. కాగా రాష్ట్రంలో దేవుడి విగ్రహాల ధ్వంసంలో చంద్రబాబు ప్రమేయం ఉందన్న వియసాయిరెడ్డి.. ఆలయాలపై టీడీపీ దాడుల ఘటనపై ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని కూడా పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

## ఏపీలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సిందే

కిషన్ కౌల్, జస్టిస్ హృషికేశ్‌రాయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. గోవా సహా పలు రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలు వాయిదా పడ్డాయని.. కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియ కోసం వాయిదా వేశారని రోహత్గి కోర్టుకు విన్నవించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో.. పోలీసులు వ్యాక్సిన్ భద్రతలో ఉన్నారని వివరించారు. రాష్ట్ర హైకోర్టు సింగిల్ జడ్జి ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చారని రోహత్గి తెలిపారు. వ్యాక్సినేషన్ కోసం 5 లక్షల మంది సిబ్బంది అవసరమవుతారని పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని వెల్లడించారు. దీనిపై వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం ఎన్నికలు వాయిదా వేయడం కుదరదని స్పష్టం చేసింది. ''ఎన్నికలు జరపడం ఎన్నికల సంఘం విధి.. ఈ వ్యవహారంపై కోర్టు జోక్యం చేసుకోవడం సబబు కాదు కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడేమో ఎన్నికలు కావాలన్నారు. ప్రభావం తగ్గినప్పుడేమో వద్దంటున్నారు. దేశంలో రాజ్యాంగ బద్ధమైన వ్యక్తులు ఏం చేయాలి? ఏం చేయకూడదు? అని కోర్టు చెప్పాలా. ఎన్నికలు వాయిదా వేసుకుంటూ వెళ్లడం సరికాదు.

## పంచాయతీ ఎన్నికల పూర్తి షెడ్యూల్

- ఫిబ్రవరి 4న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు
- ఫిబ్రవరి 9న పోలింగ్
(ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు)
- ఫిబ్రవరి 9న సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

**రెండో దశ ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్**

- ఫిబ్రవరి 2 నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఫిబ్రవరి 4 నామినేషన్ల దాఖలుకు తుది గడువు
- ఫిబ్రవరి 5న నామినేషన్ల పరిశీలన
- ఫిబ్రవరి 6న నామినేషన్లపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన
- ఫిబ్రవరి 7న అభ్యంతరాలపై తుది నిర్ణయం
- ఫిబ్రవరి 8న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు
- ఫిబ్రవరి 13న పోలింగ్(ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు)
- ఫిబ్రవరి 13న సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

**3వ దశ ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్**

- ఫిబ్రవరి 6 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- ఫిబ్రవరి 8న నామినేషన్ల దాఖలుకు తుది గడువు
-ఫిబ్రవరి 9న నామినేషన్ల పరిశీలన
- ఫిబ్రవరి 10న నామినేషన్లపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన
- ఫిబ్రవరి 11న అభ్యంతరాలపై తుది నిర్ణయం
- ఫిబ్రవరి 12న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు
- ఫిబ్రవరి 17న పోలింగ్(ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు)
- ఫిబ్రవరి 17న సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

**4వ దశ ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్**

- ఫిబ్రవరి 10 నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఫిబ్రవరి 12న నామినేషన్ల దాఖలుకు తుది గడువు
- ఫిబ్రవరి 13న నామినేషన్ల పరిశీలన
- ఫిబ్రవరి 14న నామినేషన్లపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన
- ఫిబ్రవరి 15న అభ్యంతరాలపై తుది నిర్ణయం
- ఫిబ్రవరి 16న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు
- ఫిబ్రవరి 21న పోలింగ్ (ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు)
- ఫిబ్రవరి 21న సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

- పంచాయితీ ఎన్నికలు జరిగే మొత్తం మండలాలు- 659
-తొలిదశలో పంచాయితీ ఎన్నికలు జరిగే మండలాల సంఖ్య - 173
-రెండవ దశలో పంచాయితీ ఎన్నికలు జరిగే మండలాల సంఖ్య - 169
-మూడవదశలో పంచాయితీ ఎన్నికలు జరిగే మండలాల సంఖ్య - 171
- -నాలుగవ దశలో పంచాయితీ ఎన్నికలు జరిగే మండలాల సంఖ్య - 146
- -నాలుగవ దశలో పంచాయితీ ఎన్నికలు జరిగే మండలాల సంఖ్య - 146

# తూర్పు కోస్తా రైల్వే కుటుంబ సభ్యులకు 72వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



## *గణతంత్ర దినోత్సవం సందర్భంగా తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ విద్యాభూషణ్ వారి సందేశం*



ప్రియమైన తూర్పు కోస్తా రైల్వే కుటుంబ సభ్యులకు, 72వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మీ అందరకు హృదయపూర్వక అభినందనలు. గత గణతంత్ర దినోత్సవం-2019 నాటి నుంచి, కోవిడ్-19 మహమ్మారీ యొక్క బహు విధాలైన సవాళ్ళను మరియు అందుకు సంబంధించిన ఆర్థిక ప్రభావాలను భారతదేశం ఎదుర్కోవలసి వచ్చినది. గౌరవనీయులైన మన ప్రధానమంత్రి నరేంద్ర మోది క్రియాశీలక నాయకత్వంలో మన భారతీయులు అత్యంత ధైర్యంగా మరియు ధృఢసంకల్పంతో ఈ సవాళ్ళను అధిగమించి విజయం సాధించగలిగాము అన్న విషయం మీతో హృదయపూర్వకంగా పంచుకుంటున్నాను. మీరు ప్రదర్శించిన శ్రమశక్తి, ధైర్యం మరియు అంకితభావంను రైల్వేల మంత్రిత్వశాఖ గుర్తించి, అత్యంత ప్రతిష్టాకరమైన నాలుగు పతకములు (షీల్డులు) 2019 సంవత్సరంనకు మొత్తం సామర్ధ్యతకు గోవింద వల్లభ పంత్ షీల్డ్, ట్రాఫిక్ ట్రాన్స్ పోర్టేషన్ షీల్డ్, ఫైనాన్స్ & అకౌంట్స్ మేనేజుమెంట్ షీల్డు మరియు సేల్స్ మేనేజుమెంట్ షీల్డ్ పురస్కారాలు అందచేసారని మీకు తెలియచేయుటకు నేను సంతోషిస్తున్నాను. కోవిడ్-19, వర్షాలు, లా డౌన్లు వగైరా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటు మీరు నిర్వర్తించిన విధి నిర్వహణలకు నేను గర్విస్తున్నాను. ఈ సామర్ధ్యతే అన్నిజోన్లలో తూర్పు కోస్తా రైల్వేను ఉత్తమమైనదిగా నిలబెట్టినది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే అత్యధిక సరకు రవాణా 144.28 ఎంటి మరియు పని నిర్వహణ 95.65% సాధించినది. కోవిడ్ అంటు వ్యాధి బారి నుండి మనం మన ఉద్యోగులను మరియు వారిపై ఆధారపడిన వారికి మాత్రమే కాకుండా మన చుట్టూ ఉన్న ప్రజలకు సైతం సేవలు అందించాము. విడ్-19 వ్యాప్తి మరియు చికిత్స సవాళ్ళను ఎదుర్కోవటానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి మనం కలసి మెలసి పని చేశాము. డివిజన్లు మరియు హెడ్ క్వార్టర్లు వద్దనున్న మన వ్యాపార అభివృద్ధి కేంద్రాలు, మంత్రిత్వశాఖ యొక్క వివిధ రకాలైన ప్రోత్సాహకాలు మరియు మినహాయింపులతో ఆకర్షణీయమైన అదనపు ట్రాఫిక్ నిర్వహించాయి. అవి రైలే నకు ఫ్లైయాష్, గ్రానైట్, సున్నపురాయి చిప్స్, ఎక్సర్ట్-బౌండు స్లాగ్ వగైరా వంటి కొత్త సరకులను తెచ్చాయి. కోవిడ్-19 లాక్ డౌన్లు ఉన్నప్పటికి హారిదాపూర్-పరదీప్ 82 కి॥మీ మార్గంనకు 31.07.2020న ఆరంభించుట ద్వారా ఈకార్ తన మౌలిక సదుపాయముల అభివృద్ధిని కొనసాగించినది. అదనంగా 112 కి॥మీ డబుల్ లైన్లు కూడ ప్రారంభించినది. 23 స్టేషన్లు వద్ద కొత్తగా ఎఫ్ఓబిలు ఏర్పాటు చేయటమైనది. 20 స్టేషన్లు వద్ద అదనపు ఫ్లాట్ ఫారం షెడ్లు ఏర్పాటు చేయటమైనది, 18 స్టేషన్లు వద్ద వేచి ఉండే గదులు (వెయిటింగ్ హాల్స్) మెరుగుపరిచాము. 10 స్టేషన్లు వద్ద సర్కులేటింగ్ ఏరియా మెరుగుపరిచాము. దివ్యాంగుల కోసం మరుగు దొడ్లు 28 స్టేషన్లు వద్ద మరియు ర్యాంపులు 66 స్టేషన్లు వద్ద డిసెంబర్ 2020 నాటి వరకు ఏర్పాటు చేశాము. లాక్ డౌన్ ఉన్నప్పటికి, మనం వృధాగా కాలక్షేపం చేయలేదు. మనం ఆస్తుల నిర్వహణను హెచ్చింపు చేసాము. రైలు పట్టాలు 557 కి.మీ పైగా మార్చాము. స్లీపర్లు 124 కి.మీ పైగా మార్చాము. ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్ ఎక్విప్మెంట్ నకు 1125 కి?మీ పైబడి మధ్యంతర ఓవర్ హాలింగ్ మనం పూర్తి చేసాము మరియు కాలాను గుణమైన ఓవర్ హాలింగ్ 451 కిఎంమీ పూర్తి చేశాము. రైళ్ళు నడవటం కోసం అవసరమైన ప్రతి ఆస్తి, అనగా పట్టాలు, సిగ్నలింగ్ పరికరాలు, ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్ పరికరాలు, లోకో మోటివ్లు,కోట్లు మరియు వ్యాగన్లు వంటి అన్నింటికి అన్ని బకాయి నిర్వహణలు చేయటం ద్వారా ఆస్తులు నుండి కోరుకున్న ఉత్పాదకత మరియు విశ్వసనీయత సాధించాము. ప్రభుత్వం వలస కార్మికులను మరియు ఒంటరిగానున్న వ్యక్తులను వారి గృహాలకు చేర్చాలని ఆలోచన చేసినపుడు, ఈకార్ సందర్భం కొరకు మన ముందస్తు సిబ్బంది అయిన రైలు డ్రైవర్లు, గార్డులు, టికెట్ తనిఖ సిబ్బంది, ఆర్‌పిఎఫ్ సిబ్బందిని, కోట్లు, పట్టాలు, సిగ్నల్స్, ఓహెచ్ఇ వగైరా కొరకు నిర్వహణ సిబ్బంది సమాయత్తపరచినది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే 190 శ్రామిక్ ప్రత్యేక రైళ్ళు (ఒడిశాలో 187 మరియు ఆంధ్రప్రదేశ్ లో 3 నెంబర్లు) స్వీకరించినది. అవి 3.42 లక్షల ప్రయాణికులను తీసుకువచ్చాయి.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే కూడ 14 శ్రామిక్ ప్రత్యేక రైళ్ళను పంపటం ద్వారా 17,824 మంది ప్రయాణికులను వారి గృహాలకు చేర్చినది. ప్రయాణికులు అందరకు రైళ్ళలో మరియు ఫ్లాట్ ఫారంలు పైన ఆహారం, నీటి సీసాలు, వైద్య సేవలు, భద్రత ఏర్పాట్లు కల్పించినది. రాష్ట్ర ప్రభుత్వాల ప్రశంసనీయసహాయంతో రైళ్ళు మరియు స్టేషన్లు నందు కోవిడ్-19 ముందస్తు చర్యలు అన్నింటిని మనం సంక్రమంగా నిర్వర్తించాము. మార్కెట్ నందు కోవిడ్-19 ఉత్పత్తులు గిరాకి పెరిగిపోవటంతో, ఈస్ట్‌కోస్ట్ రైల్వే తమ స్వంత తయారీ సామర్ధ్యంతో 69,000 మాలు, 5800 లీటర్లు హేండ్ శానిటైజర్, హాస్పిటల్ పడకలు, ఐవి స్టాండులు, ట్రాలీలు మొదలైనవి తయారు చేసుకున్నది. డ్రగ్ కంట్రోలర్, ఒడిశా వారి నుండి అనుమతి పొంది హేండ్ శానిటైజర్ తయారు చేసిన భారతీయ రైల్వేలలోని మొట్ట మొదటిది మంచేశ్వర్ వర్క్ షాప్.

కంట్రోలలు, ట్రాలీలు - శానిటైజంధ్యంతో 69,0 కేంద్ర ప్రభుత్వ వనరులతో కుర్దా, విశాఖపట్నం మరియు భువనేశ్వర్ వద్ద 187 పడకల సామర్ధ్యం కలిగిన 3 కోవిడ్ హాస్పిటల్స్ ఏర్పాటునకు ఈకార్ దోహదపడినది. అంతేకాక మనం 356 పడకల సామర్ధ్యంతో 6 క్వారంటైన్ కేంద్రాలను ఏర్పాటు చేశాము. ఇంకను మనం 2048 పడకల సామర్ధ్యంతో రైల్వే కోచ్లలో 261 మొబైల్ కోవిడ్ కేంద్రాలను సృష్టించాము. మనం కోవిడ్-19 హాస్పిటల్స్ వద్ద 996 మంది (970 మంది రైల్వే ఉద్యోగులు మరియు 26 మంది పౌరులు) కోవిడ్-19 రోగులకు చికిత్స చేసాము. మనం సుమారు 6000 కోవిడ్-19 పరీక్షా నమూనాలు సేకరించాము, వాటిలో 3383 పరీక్షలు మన దగ్గర నిర్వహించాము మరియు 2551 శ్యాంపుల్స్ రాష్ట్ర ప్రభుత్వాల ల్యాబ్స్ నకు పంపించాము. లాక్‌డౌన్ కాలంలో గ్రామీణ రవాణా నిలిపోవటంతో, నిత్యవసర సరకుల రవాణా కొరకు మనం ప్రత్యేక గూడ్స్ రైళ్ళను నడిపేం దుకు సన్నద్ధమయ్యాము అంతేకాక మనం మందులు, వైద్యపరికరాలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, కోళ్ళు, చేపలు మరియు ఇతర వినియోగదారు వస్తువులను మన పరిధీలోని ప్రాంతం అంతటికి మరియు దేశం నలుమూలలకు ప్రత్యేక రైళ్ళ ద్వారా పార్శిల్ సరకులు రవాణా చేశాము. ప్రతిరోజు 10 జతల పార్శిల్ ప్రత్యేక రైళ్ళను 11129 టన్నుల సరకులను రవాణా చేయుటకు నడిపాము. లాక్ డౌన్స్ సడలించిన తర్వాత, ప్రజలు తమ అత్యవసర ప్రమాణాలు చేయటం కోసం వీలుగా ప్రత్యేక కోచింగ్ రైళ్ళు నడపటం మనం ప్రారంభించాము. డిసెంబర్-2020 వరకు 888 నెంబర్లు ప్రత్యేక రైళ్ళను నడపటం ద్వారా 37.3 లక్షల ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చాము. లాక్‌డౌన్ సడలించిన తర్వాత, ఈకార్ తమ కార్యకలాపముల నిర్వహణను వేగవంతం చేసిన విషయం మీతో పంచుకోవటం నాకు అనందంగా ఉంది. లాక్ డౌన్ ఇక్కట్లును అధిగమించుట ద్వారా 2019-20 సరకు లోడింగ్ ను ఇంచుమించు కొద్ది రోజుల క్రితమే పూర్తి చేసామన్న విషయం మీకు చెప్పటం ఎంతో గర్వంగా ఉంది. మన సిబ్బందిలోని శక్తి ఉత్సాహం మరియు సంకల్పం చూసిన నేను 2020-21లో 2019-20ని అధిగమించి అన్ని జోనులలో ఉత్తమంగా నిలుస్తామన్న విశ్వాసం కలిగి ఉన్నాను.

మన ఈస్ట్‌కోస్ట్ రైల్వే కుటుంబంలోని ప్రతి ఒక్కరిని, వారి కుటుంబాల వారిని, మన ఖాతాదారులను అధికారులను మీ ధైర్య సాహసాలను పెంపొందించుకుని గెలుపు సాధనకు కృషి చేయవలసినదిగా నేను ప్రోత్సహిస్తున్నాను. ఎన్నో సవాళ్ళను కష్టాలను అధిగమించి పైన తలిపిన ఫలితాలు సాధనలో మన సిబ్బంది సంఘాలు, ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఎస్‌సి మరియు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఎస్‌యు, ఈకార్ డబ్ల్యూడబ్ల్యూఓ, బిఎస్& జి సివిల్ డిఫెన్స్, ప్రమోటీ ఆఫీసర్స్ అసోసియేషన్, ఈకార్ పీఓఏ ఇలా మా సిబ్బంది యొక్క ప్రతి వర్గం వారు తమ హృదయపూర్వకమైన మద్దతు మరియు చొరవ చూపటం నాకు అత్యంత సంతృప్తిని కలిగించినది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే విజయానికి తమ మంతు వెలకట్టలేని సహకారమందించిన ప్రతి ఒక్క యూనియన్లు మరియు అసోసి యేషన్స్ వారికి నా ధన్యవాదాలు. ఇలా కొనసాగిస్తూ ఉండండి'' అని నేను అంటున్నాను.

## సుప్రీంకోర్టు తీర్పుపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి స్పందన



విశాఖపట్నం : దేశంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునకు కట్టుబడి వుండాలని, పంతాలు, పట్టింపులకు పోకుండా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభు త్వం సహకరించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్య నారాయణ మూర్తి సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## అయోధ్యలో రామ మందిరం కోసం నిధులు సేకరణ




భీమునిపట్నం : అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం బిజెపి పార్టీ చేపట్టిన నిధి సమర్పణ కార్యక్రమంలో భాగంగా తగరపువలస గ్రామంలో రామ భక్తులు నిధులు సేకరించారు . పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమం లో నాయకులు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ నుండి రెండవ వార్డ్ భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్ కంటెస్టెంట్ గని వాడ పార్వతి, గుజ్జు రాము, వెంకటరమణ, త్రినాద్ రెడ్డి మరియు వై ఎస్ ఆర్ సి పి పార్టీ ప్రతినిధులు అక్రమాన రామునాయుడు, కరుణాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విరాళాలు సేకరించారు. డిసిఆర్ వ్యాపార అధినేత గోపి ఐదు వేల విరాళాన్ని ప్రకటించారనీ, రామభక్తులు ఎవరైనా విరాళాలు ఇవ్వాలని కోరుకున్నట్లు అయితే వారికి తోచిన విరాళాలను ఇవ్వవలసిందిగా ఈ కార్యక్రమం ద్వారా సూచించారు.

## ఓటరు దినోత్సవంపై ర్యాలీ




మాకవరపాలెం : మండల కేంద్రమైన మాకవరపాలెంలో సోమవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ప్రభుత్వ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆధ్వర్యం వహించిన మాకవరపాలెం తహశీల్దార్ రాణిఅమ్మాజీ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని మంచి వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పెందుర్తి జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం



పెందుర్తి : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పెందుర్తి జూనియర్ కళాశాలలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం కళాశా లలో జరిగిన ప్రత్యేక కార్య క్రమంలో ప్రిన్సిపాల్ జె.విజయ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరి రక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. 18 ఏళ్లు వయసు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగిపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో జాతీయ ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనకాపల్లిలో వివేకానంద సంస్థ సేవా కార్యక్రమాలు



**మాతృమూర్తులకు.. ఘనంగా సత్కారం**
**కబడ్డీ జట్లకు ప్రోత్సాహం**
**కోచ్‌లకు సన్మానం**
**భోజనం, అల్పాహారాలు ఏర్పాటు**

విశాఖపట్నం : వన్టౌన్లో ఉన్న శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ.. అనకాపల్లిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టింది. జాతీయ కబడ్డీ సెలక్షన్లకు అనకాపల్లి విచ్చేసిన.. కబడ్డీ జట్లకు.. భోజనం, అల్పాహారాల సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా.. కబడ్డీ జట్ల కోచ్ లు మీరజ్ పటేల్, శ్రీనులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా.. శ్రీ స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను విజయ వంతం చేయడంలో.. ముఖ్య భూమిక పోషించిన మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. అనకా పల్లి శ్రీ నూకాలమ్మ వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ.. లీడర్ దిన పత్రిక ఎడిటర్ వి.వి.రమణమూర్తి, మాతృ మూర్తులందరికీ శ్రీ నూకాలమ్మ వారి ప్రత్యేక దర్శనాలు చేయిం చారు. ఈ సందర్భంగా ఆయనకు సంస్థ సభ్యులు, మహిళా సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## వార్డు ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తాను

### కేఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కందుల నాగరాజు



విశాఖపట్నం : వార్డు ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తానని కేఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కందుల నాగరాజు తెలిపారు. జీవీఎంసీ 32వ వార్డ్ నేరెళ్ళకోనేరుకు చెందిన నీలం గౌరికిషోర్ అనారోగ్యంతో మరణించిన సమా చారం తెలుసు కొని ఆ కుటుంబాన్ని నాగరాజు పరామర్శిం చారు. ఈ సందర్భంగా కుటుంబ సభులకు ధైర్యం చెప్పి తానున్నా ననే భరోసా కల్పించారు. ఈ సందర్భంగా నాగ రాజు మాట్లాడుతూ మృతునికి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, ట్రస్ట్ తరపున పిల్లలకు అవసరమైన సహాయంచేస్తానని ప్రకటించి,ఆర్థిక సహాయం అందచేశారు.వార్డ్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, తన పరిధిలో వార్డ్ ప్రజలందరికీ సేవా కార్యక్రమాలు చెయ్యడానికి ఎప్పటికీ వెను కడుగు వెయ్యనని నాగరాజు తెలిపారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నాగ రాజు వెంట నీలబాబు, వడ్డాది అప్పారావు, ఆదిబాబు తదితరులున్నారు.



విశాఖపట్నం లో ఉన్న సమాజ సేవ లో ఉన్న స్వచ్ఛంద సంస్థలను గుర్తించి సత్కరించాలి అని సత్ సంకల్పంతో పిన్నమనేని శ్రీనివాస్, జేడీ ఫౌండేషన్, గోపాలపట్నం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా సంస్థలు, సేవకుల ఆత్మీయ సమావేశంకి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేడీ లక్ష్మీనారాయణ చేతులు మీదుగా సాయి పూజా ఫౌండేషన్ ఛైర్మన్ వానపల్లి రవికుమార్ చేస్తున్న సేవలను (అనాధశవ అంతిమ సంస్కారాలు) అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వామీజీ, ఇంటిలిజెన్స్ డిఎస్‌పి శ్రీనివాస్, పిన్నమనేని శ్రీనివాస్, బాలాజీ, స్వచ్ఛంద సంస్థలు, జేడి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కనీస మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు

### - దేవరాపల్లి పిఎసిఎస్ చైర్ పర్సన్ గోవింద



దేవరాపల్లి : కనీస మద్దతు ధర పై రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు స్థానిక పిఎసిఎస్ చైర్ పర్సన్ దాసరి గోవింద తెలిపారు. సొసైటీ కార్యాలయంలో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నామని ప్రకటించారు. ఇప్పటివరకు సొసైటీ పరిధిలో 419 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఆర్ జి ఎల్, 1075, స్వర్ణ రకాల ధాన్యాన్ని సేకరించనున్నారు. అనవసరంగా రైతులు తొందరపడి ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించవద్దని పిలుపునిచ్చారు. గోళ్ల సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్నా అందరికీ అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే రైతులకు 20వేల గొనులను అందజేశామని, మరో 5 వేల గోనులు సరఫరాకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ గోల్లను శ్రీ గణేష్ రైస్ అండ్ ఫ్లోర్ మిల్ పాండ్రంగి సహకారంతో సరఫరా చేస్తున్నామన్నారు. సచివాలయం సిబ్బంది నివేదిక ఆధారంగా తూనిక చేసి మిల్లులకు పంపిస్తున్నామన్నారు. ధాన్యం లోడింగ్ ఖర్చు రైతులే ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సి ఈ ఓ ఎన్. కనకరావు ఉన్నారు.

**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION** VIZAG ...ahead

'e' Procurement Tender Notice No.44/2020-21/EE-III(WS)/DB-III Dt:20-01-2021

| | | | | |
|---|---|---|---|---|
| 1 No. of Works | :1 Nos Providing drinking water arrangements for COVID-19 | | | |
| 2 Value of Works (ECV) | : | Rs.3.15 Lakhs | | |
| 3 Down Loading Starting Date | : | 21-01-2021 | @ | 2.00 PM |
| 4 Down Loading Ending Date | : | 28-01-2021 | @ | 3.00 PM |
| 5 Last date of Bid submission | : | 28-01-2021 | @ | 4.00 PM |
| 6 Date of Opening of Tender | : | 28-01-2021 | @ | 4.01 PM |

Note:For any other details required in respect of above tender notice, please contact EE-III(WS) before applying for tender schedules and visit vsp @ www.apeprocurement.gov.in.

EE-III(WS)

స్వచ్ఛ ఆంధ్ర | స్వచ్ఛ విశాఖ

ఇంటింట మరుగుదొడ్డి - బహిరంగ మల విసర్జనకు స్వస్తి

# విజయభాను సంపాదకీయం

## జగం మారుతున్నది జనానికి చెప్పండి

దేశంలో ఒక రకమైన సంధి దశలో కీలకమైన ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన నాటి ప్రధాని పీవీ నరసింహారావు.. ఆ ఫలితాలు ప్రజలకు మేలు చేయాలని ఆశించారు. స్వేచ్ఛాయుత ఆర్థిక విధానాల ద్వారా దేశంలో ఏం మార్పులు వస్తాయనేది ప్రజలకు వివరంగా అర్థం కావాలని కోరుకున్నారు. అందుకు ప్రభుత్వ యంత్రాంగానికి తోడు ప్రజా సంబంధాల రంగం తోడ్పాటు ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు. 1992 నవంబర్ 13న న్యూఢిల్లీలో జరిగిన 15వ అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సులో తన భావాలను పంచుకున్నారు. ఆ ప్రసంగానికి తెలంగాణ రాష్ట్ర సమాచార శాఖ సంయుక్త సంచాలకుడు కన్నెకంటి వెంకటరమణ సంక్షిప్త అనువాదమిది.

ప్రజాసంబంధాల రంగంలో అపార అనుభవం కలిగిన మీ అందరి మధ్యకు వచ్చి నేను చెప్పదలచుకున్న విషయం ఒకటుంది. ఒక విషయాన్ని ప్రజల మనసుల్లోకి చొచ్చుకుపోయేలా చేసి, వాళ్ల నమ్మకాన్ని ప్రభావితం చేసే శక్తి మీకుంది. మీ సామర్థ్యాలకు, నైపుణ్యాలకు ఉన్న శక్తి అది. ఇప్పుడు నేను ఈ దేశానికి ఏది అవసరమో, ఈ ప్రపంచానికి ఏది అవసరమో, దేనినైతే నేను పూర్తిగా విశ్వసించానో, ఈ దేశ ప్రజలు కూడా పూర్తిగా విశ్వసించగలరని నమ్ముతున్నా.. దానిని నేను అమ్ముతున్నాను. ఈ దేశంలో మనం ఇప్పుడు చేస్తున్న పని సరైన పని అని, ఆ పని చేయడానికి ఇదే తగిన సమయమనే విషయాన్ని అమ్ముతున్నాను. అదే నమ్మకంతో నేను ఇవ్వాళ మీ ముందుకు వచ్చాను. నేను ఏదైతే చెప్పలేకపోతానో, ప్రజలకు అర్థం చేయించలేకపోతానో ఆ విషయాలు ప్రజలకు అర్థం చేయించడంలో మీ అనుభవం చాలా అవసరమని ఆశించి మీ ముందుకువచ్చాను.

ఇప్పుడు మేం చేస్తున్న ఆలోచనలు, చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజలందరికి, ప్రపంచం మొత్తానికి అర్థమయ్యేలా చేయాలంటే ఇంకా చాలా చేయాలి. చాలా దూరం పయనించాలి. ఎన్నో దశాబ్దాలుగా మనం మాట్లాడుతున్న ఒక నూతన అంతర్జాతీయ సమాజం ఇవ్వాళ అందరికీ కనబడుతున్న ఒక వాస్తవం. తేడా ఏమిటంటే- సానుకూల వాతావరణం లేనప్పుడు మనం ఏదైతే మాట్లాడామో, దానినే మనం ఇప్పుడు సానుకూల వాతావరణంలో మాట్లాడాల్సి రావడం. ఇవ్వాళ, ప్రపంచం తన భాష మార్చుకున్నది. మనం దానిని మార్చాల్సిన పని లేదు. మనం ఎన్నో ఏళ్లుగా ఏదైతే మాట్లాడామో, అదే పరిభాషను ఇవ్వాళ మొత్తం ప్రపంచం మాట్లాడుతున్నది. ఒక్కసారి చరిత్రలోకి వెళ్లి చూడాలని అనుకుంటే- శతాబ్దాలు, శతాబ్దాల వెనక్కి చూడాలనుకుంటే - మనం మాట్లాడిన శాంతి, మనం మాట్లాడిన సహకారం, మనం మాట్లాడిన అహింస - ఇలాంటి పదాలన్నీ ఇవ్వాళ ఫ్యాషన్ పదాలుగా మారిపోయాయి.

ఇప్పుడు అందరూ మాట్లాడుతున్నది సహకారం, చర్చ. ఉత్తర దక్షిణ ధ్రువాల మధ్య సర్దుబాటు ధోరణి. సంపన్న, పేద వర్గాల మధ్య అంతరం తగ్గించడం. తమకు కావాల్సినదానికన్నా ఎక్కువ ఉన్నవాళ్లు, తమకు అవసరం ఉన్నదానికంటే కూడా తక్కువ ఉన్న వాళ్ల మధ్య అంతరం తగ్గించడంపై సర్దుబాటు: వినాశకర సాంకేతికత వినియోగంతో ప్రకృతిని దుర్వినియోగం చేసినవాళ్లు- ప్రకృతికి హాని కలిగించని పరిశుద్ధ సాంకేతికత ఆసరాగా ప్రకృతితో సహజీవనం చేసేవాళ్ల మధ్య సర్దుబాటు: వేల సంవత్సరాలుగా ప్రకృతితో కలిసి బతుకుతున్న వాళ్లున్నారుబీ ప్రకృతి నాశనం కాకుండా ఉండే పద్ధతులు, సానుకూల సాంకేతికత కోసం ఇలాంటివాళ్లు ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇలాంటి సంధికాలంలో మనం ఇప్పుడున్నాం. ఇలాంటి అంశాలన్నిటికీ, ఘర్షణపూరిత వైఖరితో కాకుండా చర్చల ద్వారా పరిష్కారం వెతుక్కోవాల్సిన సమయం ఇది. ఇప్పుడు కావాల్సింది ఆలోచనల కలయిక. పొద్దనకా, రాత్రనకా ఆయా అంశాల మీద విభేదించేవాళ్లతో మాట్లాడుతూ, వాళ్లను ఒక అంగీకార వేదిక మీదకు తీసుకురావాల్సిన అవసరం ఇది. ఈ కొత్త పనిని ఇప్పుడు తలకెత్తుకోవాలి. ప్రజా సంబంధాల వ్యవహారాలను సంప్రదాయ ధోరణిలో చూసే వ్యక్తుల ఊహకు కూడా అందని రీతిలో కొత్త రకం ప్రజా సంబంధాలు దానికి అవసరం. దానికోసం, మీరు కొన్ని కొత్త విషయాలు నేర్చుకోవాల్సి రావచ్చు.

మీ అనుభవాన్ని మరింత మెరుగుపరచుకోవాల్సి రావచ్చు. ఈ రంగంలో మీరంతా కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తూ ఉన్నారు. ఇలా పనిచేస్తున్న క్రమంలో, మీలో కొంతమంది పాత తరం నిపుణులతో కూడా కలిసి పనిచేసి ఉండవచ్చు. ప్రజా సంబంధాల పనులు కొత్త పంథాలోకి వెళ్ళేటప్పుడు కొన్ని కొత్త నైపుణ్యాలు అవసరమవుతాయి. ప్రజలను ఒప్పించడానికి కొత్త పద్ధతులు అవసరమవుతాయి.

## రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనాలను ప్రారంభించిన కె కె రాజు



అక్కయ్యపాలెం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఇంటికీ రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనం ద్వార అందించాలని డిపోలకు వెళ్లి పడికాపులు పడకుండ కష్టాలు పడకుండా ఇంటికొచ్చే విధానాన్ని తీసుకొస్తూ రేషన్ డోర్ డెలివర్ వాహనాలు పథకం ప్రారంభించిన శుభ సందర్భంగా సోమవారం విశాఖ ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయం వద్ద విశాఖ ఉత్తరనియోజవర్గ సమన్వయకర్త కె కె రాజు 26,51వార్డు సంబంధించిన వాహనాలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాస్,కె అనిల్ కుమార్ రాజు, పీలా వెంకట్ లక్ష్మి, రెయ్యి వెంకట్ రమణ, సారిపిల్లి గోవింద్, అల్లు శంకర్ రావు , పైడి శ్రీను,పైడి ప్రతాప్, షేక్ బాబ్జి, నంబాల రాజేష్,సతీష్, తదితరులు పాల్గొన్నారు.



*జగద్గురు శ్రీ శ్రీ శంకరాచార్య శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి మరియు శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామివారి దివ్య ఆశీస్సులు అందుకుంటున్న జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు డాక్టర్ బొగ్గు శ్రీను, న్యాయవాది రామ్మోహన్*

## టిడ్కో గృహ మంజూరు పత్రాలు పంపిణీ చేసిన అనిల్ కుమార్ రాజు



సీతమ్మధార :గ్రేటర్ విశాఖ 14వ వార్డు సీతమ్మదార సచివాలయంలో, టిడ్కో గృహ మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా 14వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి కతారి అనిల్ కుమార్ రాజు హాజరయ్యి,లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందచేసారు.ఈ సందర్భంగా కతారి అనిల్ కుమార్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఒక్కరికి భూమి హక్కు కల్పిస్తూ ,30 లక్షల కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించిన ఘనత, ప్రియతమ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డిది అని ప్రశాంశించారు. ఈ కార్యక్రమంలో సీ డి ఓ పద్మావతి, సీ ఓ రమణి, వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



*భీమునిపట్నం : జాతీయ ఎన్నికల నిర్వహణ లో సమర్థ వంతంగా పనిచేసిన భీమిలి తహశీల్దార్ కె వెంకట ఈశ్వర రావు కి మరియు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.సువర్ణ భాయి లకు ప్రసంసా పత్రాన్ని అందిస్తున్న జాయింట్ కలెక్టర్ వేణుగోపాల రెడ్డి*

# కవి సమయం

## ‘అభ్యుదయ కిరణం - గురువు’

మనిషిని ఆదివాసి నుండి
అనంత లోకాలపై ఆధిపత్యానికి
సోపానాలు వేస్తూ
మానవ మేథోసంపత్తును
ఉన్నత శిఖరాలకు చేరుస్తున్న
ఒక వెలుగు కిరణం... గురువు
‘విద్య ఒక తపస్సు
జీవితానికి అది... ఓ ఉషస్సు’
అన్న సూక్తిని నిజం చేస్తూ
అనుక్షణం శోధిస్తూ...
అనునిత్యం బోధిస్తూ...
విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి
శిష్యోన్నతే గురుదక్షిణగా భావించి
దిశ నిర్దేశనంలో దిక్సూచియైన
దైవ స్వరూపుడు
మా గురువర్యులు

...కవితా రచన
ఆర్.శంకర్

# పంచాంగం

మాసం : పుష్య; తిథి : త్రయోదశి రా.12.15; ఆరుద్ర రా.2.45; వ.ఉ.10.09ల 11.51. | మంగళవారం 26-01-2021

a **మేషం :** ఆంతరంగిక సమస్యలకు పరిష్కార మార్గం కానవస్తుంది. ముఖ్యుల రాకలు పెరుగుతాయి. ఆటోమొబైల్, ట్రాన్సుపోర్టు, మెకానికల్ రంగాలలోని వారికి చికాకులు తప్పవు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

b **వృషభం :** బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఉద్యోగస్తులకు స్థానమార్పిడి, కొత్త బాధ్యతలు చేపట్టే ఆస్కారం ఉంది. రాజకీయ నాయకులు తరచు సభా సమావేశాలలో పాల్గొంటారు. బంధుమిత్రలతో పట్టింపులు ఎదుర్కొంటారు. ఉమ్మడి వ్యాపారం సౌమ్యంగా సాగుతుంది.

c **మిథునం :**మీ పాత సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురవుతారు. కష్ట సమయంలో సన్నిహితులకు అండగా నిలుస్తారు. సోదరులతో సత్సంబంధాలు నెలకొంటాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆర్థిక విషయాలలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ముఖ్యుల సహకారం వలన సమసిపోతాయి.

d **కర్కాటకం :** కళాకారులకు రచయితలకు, పత్రికా రంగంలోని వారికి పురోభివృద్ధి కానరాగలదు. అలౌకిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు తప్పవు. వస్త్ర, బంగారు, వెండి రంగాలలోని వారికి సంతృప్తి కానవస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది.

e **సింహం :** ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి చికాకులు తప్పవు. శ్రమాధిక్యత వల్ల అస్వస్థతకు లోనవుతారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగాలలోని వారికి అనుకూలమైన కాలం. ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరుగుతుంది. స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరికొంత కాలం వాయిదా వేయడం మంచిది.

f **కన్య :** నూతన దంపతులకు కొత్తకొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలకు సంబంధించిన వ్యవహారాలలో మెళకువ అవసరం. దైవ కార్య క్రమాల పట్ల ఏకాగ్రత వహిస్తారు. ప్రత్యర్థులతో రాజీ కుదురుతుంది. న్యాయవాదులు చికాకులు ఎదుర్కొంటారు. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం.

g **తుల :** కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో చికాకులు తప్పవు. ధనం నిల్వ చేయాలనే మీ ఆలోచన ఫలించదు. ఉద్యోగస్తులకు బాధ్యతలు అధికం అవ్వడంతోపాటు, ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ఆపద సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. శత్రువులు మిత్రులుగా మారుతారు.

h **వృశ్చికం :** స్త్రీలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించండి. బంధువుల రాక వల్ల మీ కార్యక్రమాల్లో అంతరాయం ఏర్పడుతుంది. వస్త్ర, బంగారు, వెండి వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది. మీరు చేసే కృషి వల్ల మీ ప్రతిభ వెలుగులోకి వచ్చి మంచి విజయం సాధిస్తారు. నిరుద్యోగులకు ఆశాజనకం.

i **ధనుస్సు :** చిన్నతరహా పరిశ్రమలలోని వారికి వృత్తులలోని వారికి సంతృప్తి కానవస్తుంది. మధ్యవర్తిత్వం వహించుటవల్ల మాటపడతారు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. భాగస్వాముల మధ్య మనస్పర్థలు తలెత్తినా సమసిపోగలవు. కమ్యూనికేషన్స్, ఏజెన్సీ రంగాలలో వారికి సంతృప్తి కానవస్తుంది.

j **మకరం :**పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులే అనుకూలిస్తాయి. ప్రేమికులు ప్రతి విషయంలోనూ మితంగా వ్యవహరించడం క్షేమదాయకం. కోర్టు వ్యవహారాలు వాయిదాపడటం మంచిది. రాజకీయాలలోని వారు ప్రత్యర్థులు పెరుగుతున్నారని గమనించండి. నిర్మాణ పథకాలలో చురుకుగా పాల్గొంటారు.

k **కుంభం :** ప్రింటింగ్ రంగాల వారికి శ్రమించిన కొలదీ ఆదాయం అన్నట్లుగా ఉంటుంది. ప్రయాణాల్లోను, వాహనం నడుపుతున్నపుడు మెళకువ వహించండి. ఇంటా బయటా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటారు. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. మీ సంతానం వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది.

L **మీనం :** మీరు తలపెట్టిన పనిలో ప్రోత్సాహం లభిస్తుంది. పత్రికా రంగంలో వారికి పురోభివృద్ధి కానవస్తుంది. సోదరీ, సోదరుల మధ్య అవగాహన కుదరదు. స్త్రీలకు తల, కళ్లు, నరాలకు సంబంధించిన చికాకులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ప్రశంసలు అందుతాయి. మీ శ్రీమతి ఇచ్చిన సలహా పాటించడం మంచిది.

# భక్తి వాఙ్మయంలో భజగోవిందం

## సంకీర్తన



క్షణక్షణం మానవ జాతి యావత్తు అశాంతితో కొట్టుమిట్టాడు తోంది. స్వార్థము, మోహము, తృష్ణ, డంభములతో నడిచే మానవ జాతికి సత్సాంగత్యము, భగవద్భక్తి మొదలైన ఆర్షధర్మములే ప్రశాంతిని చేకూర్చగలవు. శంకర భగవత్పాదులు అందించిన భజగోవింద స్తుతి భక్తివాఙ్మయములో అద్వితీయ మైనది. ధార్మిక ప్రబోధము, విష్ణుభక్తి ప్రేరకముఅగు ఈ స్తుతికిగల భక్తిప్రచారము అనన్యసామాన్యము. దీనికి మోహముద్గరమని నామాంతరము కలదు. ఈ స్తుతి పండితులనుండి పామరుల వరకూ జీవన సత్యాన్ని బోధిస్తుంది. దీనిని పఠించుటవలన, అందలి సారాన్ని కొంతలోకొంతైనా ఆచరించిన జన్మ ధన్యత నొందగలదు. ఈ స్తుతి ఛందములోను, పద్య శిల్పము లోను, భావగౌరవములోను పదముల పొందికలోను అత్యంత రమణీయమైనది. శంకర భగవత్పాదులు అపర శంకరా వతారం కారణజన్ములు. 32 సంవత్సరములే జీవించినా శంకరులు ఆనాటి సాంఘిక, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతులను సమూలాగ్రంగా సమీక్షించి, భారత జాతిని ఒక్క త్రాటిపై తెచ్చిన ఘనత వీరికే చెందుతుంది. హిందూ మతస్థులందరికీ, అన్ని శాఖలవారికి అనువుగా స్తోత్రరాజాలను రచించిన ఘనత ప్రప్రథమంగా శంకరులకే చెందుతుంది. మూడు పర్యాయములు భారతదేశ సంపూర్ణ యాత్రచేసి అద్వైత తత్వాన్ని ప్రతిపాదించిన మహనీయులు శంకర భగవత్పాదులు. నాలుగు చెరగులా నాలుగు శంకరాచార్య పీఠాలను స్థాపించి ఆధ్యాత్మిక ప్రతిపత్తి కల్పించిన పరివ్రాజకుడు శ్రీ శంకర భగవత్పాదులు. ఒక విధంగా భారతీయ జీవన విధానాన్ని దిశానిర్దేశనం చేసిన మహోన్నత వ్యక్తి శ్రీ శంకర భగవత్పాదులు. అసలు భజగోవింద స్తుతి రచించటానికి ఒక వృద్ధుడు కారణభూతుడు. వ్యాకరణ పాఠాన్ని వల్లెవేయటంవలన ప్రయోజనం లేదని గోవిందుని భజించుటయే ముఖ్యమని, అదే మానవ జన్మకు తరుణోపాయమన్ని భజగోవింద స్తుతిని అందించారు శంకర భగవత్పాదులు. మొదటి శ్లోకంలో భజగోవింద మూడుసార్లు అనటంలో పునరుక్తి దోషములేదనుట భాషాకోవిదుల అభిప్రాయం. విషయము అర్థమైన రీతిలో నివేదిం చటంలో ఔచిత్యమున్నది. మొదటిసారి దీక్షాగురువులు గోవింద పాదులవారిని స్మరించటం, రెండవసారి శ్రీమన్నారాయణు ని మూడవసారి తత్వభూతమైన స్వరూపాన్ని స్మరించారని వ్యాఖ్యానకారుల అభిప్రాయం. ఇక శ్లోకాల విషయానికి వస్తే అత్యాశలేని జీవితం. ఉన్నదానిలో సంతృప్తి చెందటం (మూఢ జహిహిధనాగమతృష్ణాం), మోహాన్ని వదలి మానవీయంగా బ్రతుకుట నేర్చుకోవాలి (నారిస్త్యన భరనాభిదేశం), స్వజనులు వ్యవహరించేరీతి. మరణ సమయంలో భార్యాపిల్లలు భీతి చెందుట (యావత్పదనో నిరసతిదేహీ) వివరిస్తారు. అలాగే యదార్థతత్వాన్ని చింతన చేయాలి (కాతేకాన్తాకస్తే పుత్రః), నిస్సంగత్వం, నిర్మోహత్వం, నిశ్చలతత్వం, జీవనముక్తి హేతువు (సత్సంగత్వే నిస్సంగత్వం)గా స్వీకరిస్తూ ధనవన గర్వాన్ని వీడి శాశ్వతతత్వాన్ని పొందే ప్రయత్నం చేయాలి. (మాకురువన గర్వ) సజ్జన సాంగత్యంతోనే జన్మతరిస్తుంది (కాతేకాన్తాగత చింతా), బహుకృత వేషాలతో జీవిత వలయంలో చిక్కుకొని సత్యదర్శనాన్ని పొందటంలేదు. (జటిలో ముండిలుంచితకేశః) అంతేగాదు జ్ఞానవిహీనునికి గంగాసాగర గమనం ముక్తినందించదని (కురుతే గంగాసాగర గమనం) సర్వసంగ పరిత్యాగికి సుఖానుభూతి సులభతరమని (యోగరతోవా భోగరతోవా), నేనెవరినని ప్రశ్నించుకుంటే సంసార స్వప్నతుల్యమని (కస్త్వంకో అహంకుత ఆయాతః) బోధపడుతుంది. సమచిత్తుడవైతేనే పరమాత్మను పొందగలవు. (త్వయిమయిచ అన్యత్రైకోవిష్ణుః), సమత్వభావన అలవరచుకుంటే (శత్రేమిత్రౌపుత్రౌ బన్ధ్), సో అహం తత్వాన్ని గ్రహించగలవు. (కామక్రోధంలోభం మోహం). అలాగే ధనార్జనవల్ల శుఖము కలుగదు (అర్థమనర్థం భారయ నిత్యం). చివరగా ప్రాణాయామం, జపతపాదుల వలన సత్యతత్వం బోధ పడుతుంది.

(ప్రాణాయామం ప్రత్యాహారం). గురువు నాశ్రయించిన వానికి పరమాత్మ దర్శనం సులభతరవౌతుంది. ఎటొచ్చి వాటిని ఆచర ణాత్మకం చేసినపుడే వ్యక్తి సంస్కారవంతుడు కాగలడు. ఇటువంటి జీవన సత్యగుళికలని మనిషి పుట్టుకనుండి మరణం వరకు అన్ని ఇతివృత్తాలని తత్వవిచారంగా 32 ఏళ్ళ వయస్సులో రచించటం శంకర భగవద్పాదులు, అవతార పురుషులని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఈ శ్లోకాలను పఠించాలి, అందలి మూలార్థాన్ని స్వీకరించి మానవ జన్మను సార్థకత చేసుకోవాలి. శంకరాచార్య రచించిన కనకధారా స్తవము, సౌందర్య లహరి ఇత్యాది రచనలు దైనం దినంగా దీక్షాతత్పరులుగా పఠిస్తే సర్వకార్యసిద్ధి లభించుటయే గాక, మానసిక ప్రశాంతత సిద్ధించగలదు.

# సన్‌మూర్తికి జేడీ ఫౌండేషన్ పురస్కారం



విశాఖపట్నం : సామాజిక విశ్లేషకులు, సొసైటీ ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకులు సన్‌మూర్తికి గోపాలపట్నం కు చెందిన జేడీ ఫౌండేషన్ సేవా పురస్కారంతో సత్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షులు ఎన్ఆర్ఐ పిన్నమనేని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాలలో విశేష సేవలు అందిస్తున్న పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల విశ్రాంత పోలీసు అధికారి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బహూకరించారు. అందులో భాగంగా పరిపాలన సంస్కరణలపై ప్రభుత్వాలకు, పాలకులకు వివిధ సూచనలు చేస్తున్న ప్రముఖ విశ్లేషకులు సన్‌మూర్తికి ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా సన్ మూర్తి మాట్లాడుతూ పరిపాలనను, సేవలను ప్రజలకు చేరువ చేసే, సేవలకు సరళతరం చేసే విధంగా తగు సూచనలు సలహాలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగానికి తెలియ జేస్తున్నామని తెలిపారు. జాయిన్ ఫర్ డెవలప్మెంట్ పేరుతో జేడీ ఫౌండేషన్ సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న అందుకు సన్‌మూర్తి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి స్వామీజీ, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ బాలాజీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉత్సాహంగా క్యారమ్ పోటీలు



కంచరపాలెం : ఆన్ కామన్ రిపబ్లిక్ కప్ -2021ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్యారమ్ టోర్నమెంట్ సోమవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, విశాఖపట్నం క్యారమ్ అసోసియేషన్ సౌజన్యంతో మర్రిపాలెం శివశివానీ స్కూల్ లో జరిగాయి. గణతంత్ర దినోత్సవ సందర్భంగా 13 జిల్లాల నిది 32 టీమ్ లు పాల్గొనన్నాయని విశాఖ పట్నం క్యారమ్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేత లైన వారికి బహు మతులు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా రూ 25 వేల రూపాయలుముఖ్య అతి థుల చేతుల మీదుగా ఇవ్వనున్నట్టు తెలిపారు. యువతి, యువ కులు ప్రతిభ కొరకే ఈ పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. కోవిడ్ 19 కరోనా వైరస్ లాక్డౌన్ తర్వాత ఈ తరహా టోర్నమెంట్ ఇదే ప్రప్రథమంగా నిర్వహిం చామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో...

అధ్యక్షుడు ఎల్ కృష్ణారావు కార్యదర్శి ఏ.ఆదినారాయణరెడ్డి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# హక్కులు అడిగితే కేసులా?

## టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ ను వెంటనే విడుదల చేయాలని

## అరుకు పార్లమెంటరీ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు తామర్ల సత్యనారాయణ డిమాండ్



పాడేరు : జీవో నెంబర్ 77 ను రద్దు చేస్తూ ప్రైవేటు పీజీ విద్యార్థులు పేద విద్యార్థుల అన్ని రకాల ఫీజులను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తారీఖున సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడికి పిలుపునిచ్చిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రాణగోపాల్ ను అక్రమంగా అరెస్టు చేశారని విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాట మాడుతోందని నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని ప్రభుత్వం మర్చిపోవద్దని రాష్ట్ర ప్రభు త్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ ప్రైవేటు కాలేజీ లో చదువుతున్న పేద విద్యార్థులు అందరికీ అన్ని రకాల ఫీజులు కట్టవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం టిఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడితో పాటు నందేష్ కుమార్ ప్రవీణ్ కుమార్ తదతరులు పాల్గోన్నారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లతో ప్రతిజ్ఞ



భీమునిపట్నం : జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ ఎస్ ఎ త్రినాద రావు ఆధ్వర్యంలో ఓటర్ల తో ప్రతిజ్ఞ చేయించారు. భారతదేశ పౌరులైన మేము ప్రజాస్వామ్యం పై విశ్వాసం తో మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదా యాలను, స్వేచ్ఛా యుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ మతం, జాతి, కులం, వర్గ,భాష లేదా ఎటు వంటి ఒత్తిళ్లు కు ప్రభావం కాకుండా ప్రతీ ఎన్నికలో ఓట్లు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డి.టి. త్రినాదరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలనీ కోరారు. కొత్త ఓటరు కు ఓటర్ కార్డు అందజేశారు. అనంతరం భీమునిపట్నం సబ్ ట్రెజరీ లో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించి రిటరైన సీనియర్ ఓటర్ అప్పారావు ను సన్మా నించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సౌజన్య పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




దేవరాపల్లి : ఓటు హక్కు పైన ప్రజాస్వామ్య వ్యవస్థ పైన ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా ప్రతి ఏడాది జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటామని డిప్యూటీ తహశీల్దార్ డి. అరుణ్ చంద్ర అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల ప్రధానకూడలి వరకు భారీగా ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ,18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పక ఓటు హక్కును కల్పించుకోవాలి అని ఓటు హక్కు రాజ్యాంగం ఇచ్చిన అక్కని మంచి ఉన్నత వ్యక్తిని నాయకుడిగా ఎంచుకునేందుకు ఓటు హక్కు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సి.హెచ్ రవీంద్రబాబు,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి. స్వర్ణలత, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చంద్రశేఖర్, ఆర్ఐ వై. శ్రీనివాసరావు, వీఆర్వోలు నాగేశ్వరరావు, దొరబాబు, కళాశాల, పాఠశాల ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్న ను దర్శించుకున్న

## రాష్ట్ర ఆప్కో ఛైర్మన్ చల్లపల్లి వెంకట కృష్ణమోహన్ రావు



సింహాచలం : సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని రాష్ట్ర ఆప్కో చైర్మన్ చల్లపల్లి వెంకట కృష్ణ మోహన్ రావు సోమవారం నాడు దర్శించుకున్నారు. సింహగిరి చేరుకున్న చైర్మన్ కి సాదర స్వాగతం పలికిన ఆలయ అధికారులుస్వామి వారి అంతరా లయంలో ప్రత్యేక పూజలు అర్చక స్వాములు. నిర్వహించారు.

వీరికి ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమం తర్వాత చేనేత పరిశ్రమ ఆదుకోవడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఆప్కో మరింత అభివృద్ధి చెందే లాగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం అని దేవాలయాలలో ఆప్కో వస్త్రాలు నూతన డిజైన్ ఏర్పాట్లకు శ్రీకారం చుడుతున్నారని అన్నారు.

# కొయ్యూరు ఎస్సై ఆధ్వర్యంలో రోడ్లు బాగు



కొయ్యూరు : కొయ్యూరు ఎస్సై దాసరి నాగేంద్ర ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే రోడ్లపై దృష్టిపెట్టారు. కొయ్యూరు నుంచి కాకరపాడు వెళ్లేదారిలో సింగవరం డౌన్ వద్ద రోడ్డు మరమ్మత్తులకు గురవడమే కాకుండా రోడ్డు అంచు ఎత్తుగా ఉండటంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో కొయ్యూరు ఎస్సై దాసరి నాగేంద్ర స్పందించి రోడ్డు అంచుకు సమానంగా మట్టి వేశారు. కాకరపాడుకు చెందిన పర్గాంగుల దూరంలో ఉన్న వంతెన వద్ద కూడా రోడ్డు కోతకు గురైంది. అక్కడ రెండు ఇరుకైన మలుపులు ఉన్నాయి. అక్కడ రోడ్డు కూడా బాగు చేశారు. దీంతో ఎస్సైను పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పాల్గన్నారు. కాగా ఆర్అండ్‌బి అధికారులు చేయాల్సిన పనిని పోలీసుల చేయడంపై ఆర్అండ్‌బి అధికారులు ఏమి చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోలీసులకు ఉన్నంత సామాజిక స్పృహ కూడా ఆర్అండ్‌బి అధికారులకు లేకపోవడం శోచనీయమని వాపోతున్నారు.

# వైయస్ జగన్ ఆశీస్సులు పొందిన గొడ్డేటి మహేష్ దంపతులు



సీఎం జగన్‌తో ఎంపీ మాధవి కుటుంబ సభ్యులు

కొయ్యూరు : ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం అరకు ఎంపి గొడ్డేటి మాధవి ఆధ్వర్యంలో అరకు పార్లమెంట్ యువ నాయకులు, ఎంపి సోదరుడు గొడ్డేటి మహేష్, సతీమణి కలిసి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపి భర్త శివప్రసాద్, అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి సతక బుల్లిబాబు పాల్గొన్నారు.

# ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి




గొలుగొండ : ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గొలుగొండ తహశీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక గురుకుల కళాశాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన వారంతా ఓటు హక్కు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటి ఆనంద్, గురుకుల కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్నినిర్వహించిన

## ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వై.మంగపతిరావు



విశాఖపట్నం : జి.వి.ఎం.సి. ప్రధాన కార్యాలయం సమావేశపు మందిరం నుండి డయల్ యువర్ కమిషనర్ ప్రోగ్రామును ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వై. మంగపతి రావు టోల్ ఫ్రీ నం.1800-4250-0009 ద్వారా ఉదయం 10.00 గం. నుండి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఇందులో మొదటవ జోనుకు 04, రెండవ జోనుకు 05, మూడవ జోనుకు 03, నాల్గవ జోనుకు 02, అయిదవ జోనుకు 06, ఆరవ జోనుకు 04, పి.డి.(యు.సి.డి) విభాగమునకు 01, మొత్తము 25 ఫిర్యాదులు ఫోను ద్వారా స్వీకరించారు. స్వీకరిం చిన ఫిర్యాదులను కమిషనర్ డా.జి.సృజన ప్రధాన కార్యాలయ విభాగపు ఉన్నతాధికారులకు, జోనల్‌కమిషనర్లకు పంపుతూ, స్వీకరించిన ఫిర్యాదులు 03 రోజులలో పరిష్కరించేందుకుగాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు ఆషా జ్యోతి, సన్యాసి రావు, ప్రధాన ఇంజినీరుఎం. వెంకటేశ్వరరావు, జె.డి.(అమృత్) విజయ భారతి, ఎఫ్.ఎ ఏ.ఒ. మల్లికాంబ, డి.పి.ఓ. చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఓటరు నమోదు ప్రక్రియలో
# ఉత్తమ ప్రశంసా పత్రం పొందిన ఆర్డీవో ఎస్.మల్లిబాబు



పెద్దాపురం : ఓటర్లకు సాధికారత కల్పించడం, అప్రమత్తంగా ఉంచడం, సురక్షితంగా మరియు సమాచారం అందించడం, ఇతివృత్తంతో నిర్వ హించిన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో గల విధాన గౌతమి హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఓటరు నమోదు ప్రక్రియలో ఉత్తమ పనితీరు కనబర్చిన పెద్దా పురం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లి బాబు జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి మరియు ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మిల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

# సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి
## రూ.1,00,000/- విరాళం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన టి.వీరవెంకట సత్యనారాయణ రూ.1,00,000/- విరాళం ను దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి. త్రినాథరావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో డిశంబరు 13వ తేదీన టి.వీరవెంకట సత్యనారాయణ పేరున అన్న దానం జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఈవో త్రినాధ రావు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో...

సూపరింటెండెంట్ దామెర కృష్ణారావు పాల్గొన్నారు.

## ఈనెల 30న
# కోర్టులలో వర్చువల్ లోక్ అదాలత్

పెద్దాపురం : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేం ద్రవరం వారి ఆదేశానుసారం ఈ నెల 30 వ తేదీన పెద్దాపురం అన్ని కోర్టులలో వర్చువల్ లోక్ అదాలత్ నిర్వహింపబడునని పెద్దాపురం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి వై. బెన్నయ్య నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఈ వర్చువల్ లోక్అదాలత్ లో సివిల్, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, మోటారు వాహనాల కేసులు, బ్యాంకులు, ప్రభుత్వ రంగ కేసులు మొదల గునవి పరిష్క రించుకోవచ్చునని మరియు రాజీ చేసుకోదలచిన కక్షిదారులు తమ న్యాయవాదులను లేదా సంబంధించిన పోలీసు వారిని సంప్రదిం చవలెనని తెలిపారు. పోలీసులు, న్యాయవాదులు కోవిడ్ నిబంధ నలు, రక్షణను ఖచ్చితంగా పాటిస్తూ ఈ వర్చువల్ లోక్ అదాలత్ కు బ్లూ జీన్స్ యాప్ ద్వారా హాజరు కావాలని, వారి కక్షిదారులు కూడా కోవిడ్ నిబంధనలు పాటించే విధంగా చూడా లని సీనియర్ సివిల్ జడ్జి కోరారు.

# గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి - రాజా సిద్ధార్థ
## - గ్రామీణ వైద్యులకు ఇచ్చిన 429 జీవోను పునరుద్ధరించాలి



అమలాపురం : గ్రామీణ వైద్యులకు గుర్తింపును ఇచ్చే 429 జీవో ను వెంటనే పునరుద్ధరించి గ్రామీణ వైద్యులకు ఒక చట్ట బద్ధత కల్పించాలని రాష్ట్ర అను భవ వైద్యుల సమాఖ్య సంఘం (ఫెడరేషన్) రాష్ట్ర జాతీయ అధ్యక్షుడు రాజా సిద్ధార్ధ కోరారు. అమలాపురం ఇందుపల్లి ఎ1 కన్వెన్షన్ హాలు నందు జరిగిన ది.కోనసీమ ఆర్ఎంపి,పిఎంపి వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు కంబాల.బాబూరావు,సెక్రటరీ ఎండి.రఫీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలో ఉన్న వివిధ సంఘ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.యస్.ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి పాద యాత్రలో గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని,గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యులకు ఇచ్చిన 429 జీవో ను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా త్వరలో రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాలోని సర్వ సభ్య సమావేశాలు ఏర్పాటు చేసి ఆర్ఎంపి,పిఎంపి,బిఎంపి డబ్ల్యుఏ ఏపి ల ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లతామని అన్నారు.అదేవిధంగా ప్రభుత్వం నూతనంగా ప్రారంభిస్తున్న విలేజ్ క్లీనిక్ లను స్వాగతిస్తున్నామని,అయితే విలేజ్ క్లీనిక్ లలో గుర్తింపు ఉన్న గ్రామీణ వైద్యులకు అవకాశం కల్పించాలని కోరారు.అనంతరం గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు,విధి విధానాలపై చర్చించి భవిష్యత్తు ప్రణాళికపై తీర్మానాలు చేశారు.

ఈ గ్రామీణ వైద్యుల మహా సభకు భారీ ఎత్తున సభ్యులు హాజరు కావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసి పోయింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నండూరి. ఉమాశంకర్, జంగం.జ్యోషి, చప్పిడి.వెంకటేశ్వరరావు, వి.వి.కృష్ణారావు, పదిలం.బెన్నబాబు,గోపి,చిరంజీవి,గౌరినాయుడు,ఉపేంద్ర రెడ్డి, రామారావు, సుధాకర్ తదితర జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, ఆయుర్వేద వైద్యులు
# డి.సూరిబాబుకు ఘన నివాళులు



విశాఖపట్నం : రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, ఆయుర్వేద వైద్యులు డి. సూరిబాబు కు సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. గోకుల్ థియేటర్ రోడ్ లోని ఓ ఫంక్షన్ హాల్లో సీనియర్ పాత్రికేయులు డి. హరనాథ్ తండ్రి యైన డి. సూరిబాబు వైకుంఠ సమారాధన కార్యక్రమానికి ప్రముఖులు, బంధువులు, మిత్రులు హాజరయ్యారు.

ఉన్నత విలువల తో సూరిబాబు సాగించిన జీవన విధానాన్ని కొని యాడారు.

సూరిబాబు కుటుంబ సభ్యులను పరా మర్శించారు.

# ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి
## - ఓటుహక్కు ఒక వజ్రాయుధం - ఎన్నికల్లో పౌరులు పాత్ర కీలకం - ఓటరు దినోత్సవ ర్యాలీలో ఎమ్మార్వో బి.వి.రాణి





పరవాడ : జాతీయ ఓటరు దినోత్సవము సందర్భంగా సోమవారము పరవాడ తహశీల్దార్ బివిరాణి అద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.అనంతరము పరవాడ మండలఅఫీసు జంక్షన్ వద్ద మానహారము నిర్వహించి సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరము సినియర్ సిటిజన్స్ ను ఘనంగా సన్మానించారు. యువతకు తహశీల్దార్ బివిరాణి చేతులు మీదుగా ఓటరు కార్డులును అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లడుతూ ఒటుహక్కుఅనేది వజ్రాయుధమను, 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఒటును వినియోగించుకోవాలనీ కోరారు. ఎన్నికల ప్రక్రియ అనేది బారత్ లో ఉన్నతమైన ప్రమాణాలుతో కూడిన ప్రక్రియ అని అన్నారు.ఈస్థానిక ఎన్నికల్లో పౌరులు పాత్రచాలా కీలకమనీ అమె అన్నారు. హక్కు-బాధ్యత అనేది మేలు కలయిక అన్నారు. మంచిసమాజం,మార్పు కోసము ఓటు హక్కు విలువైనది అన్నారు. ప్రతిఒక్కరు ఒటుహక్కు వినియోగించుకోవాలనీ ఈసందర్భంగా అమె కోరారు.

ఈకార్యక్రమంలో సియస్ డిటి సులోచనరాణి, డిటి వరహలురావు,విఆర్వోలు మరియు సిబ్బంది తథితర్లు పాల్గోన్నారు.

# రైతుల ఉద్యమాన్ని నీరుగార్చుతున్న కేంద్ర ప్రభుత్వం



దేవరాపల్లి : రైతుల ఉద్యమాన్ని నీరు గార్చడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. వెంకన్న విమర్శించారు. ఈ మేరకు సోమవారం దేవరాపల్లిలో రైతులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండలం లోని వెంకట రాజ పురం, వాకపల్లి గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో రైతు సంఘం నాయకులు రెడ్డి వెంకట రావు, గండి నాయనబాబు మాట్లాడుతూ రైతులు పొట్ట కొట్టే నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి రైతుల పోరాటం చేస్తుంటే 18 నెలల పాటు చట్టాలను వాయిదా వేస్తామని కేంద్రం చెప్పడంలో అర్థం లేద న్నారు. కేంద్రం దీనికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు.

ఈ కార్య క్రమంలో సిహెచ్ రాజు, బి టి దొర, జె. సన్ని బాబు, కర్రీ దేముడు తదితరులు పాల్గొన్నారు.



31వ వార్డ్ కనకల వీధిలో సోమవారం ఉన్న రజక వృత్తి దారుల బల్లాల పండుగ సంద ర్భంగా 31వ వార్డు తెలుగుదేశం కార్పొరేటర్ అభ్యర్థి శ్రీ దొడ్డి బాపు ఆనంద్ గారిని ఆహ్వానించి ఘనంగా రజక సంఘం పెద్దలు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కనకరాజు (సంఘం ప్రెసిడెంట్), గిరి (సెక్రటరీ,గారి రాంబాబు, కర్రీ ధనలక్ష్మి, నవీన్ ,శ్యామ్ , శ్రీను, సన్యాసిరావు,రాజు, సన్యాసమ్మ ,రాము, రామయమ్మ, కనక రాజు, సింహాద్రి, వెంకట్రావు, నాగరాజు,రాము, రోహిత్, దేవుడమ్మ ,శంకర్,సన్యాసమ్మ, కృష్ణ ,నూకాలమ్మ, శివ ,సూరిబాబు తదితర సంఘం పెద్దలు పాల్గొన్నారు.

# బదిలీ అయిన ఉపాధ్యాయుడుకు ఘన సన్మానం



చిట్టిబాబును సన్మానిస్తున్న దృశ్యం

గొలుగొండ : గొలుగొండ మండలం కొమిర ఎంపిపి పాఠశాలలో గత 10 సంవత్సరాలుగా పని చేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయుడు సిహెచ్.చిట్టిబాబును గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎంఇఒ టి.అమృతకుమార్ ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టియ్య, దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చోద్యం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొల్లు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ కర్రినాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీను, అల్లు రాజు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, దిబ్బలపాలెం హెడ్ మిస్ట్రెస్ చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అయ్యరక కార్పోరేషన్ డైరెక్టర్ లకు సన్మానం
## నర్సీపట్నం నుండి కర్రి కనకమహాలక్ష్మి దంపతులు కు ప్రత్యేక ఆహ్వానం



నర్సీపట్నం : అయ్యరకలకు వారి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నందుకు గాను అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ లకు డైరెక్టర్లకు ఘన సన్మానం చేశారని కర్రి కనకమహాలక్ష్మి విలేఖర్లకు తెలియజేశారు. విశాఖపట్నం మధుర ఇన్ ఫంక్షన్ హాల్లో సొండి సంక్షేమ సంగం సమావేశంలో అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి లక్ష్మీ నారాయణ ని మరియు డైరెక్టర్స్ కు ఘనసన్మానం చేసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరక అయ్యాక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేకంగా సంఘం అభివృద్ధికి కృషి చేసేందుకు సహకరిస్తామని వీరంతా వారికి తెలియజేశారు కలిసి నడిస్తే మరిన్ని విజయాలు చేకూరుతాయని విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో..సొండి రాష్ట్ర సంఘ అధ్యక్షులు సభ్యులు పాల్గొనడం జరిగింది.

# రేషన్ సరఫరా పై సమావేశం



గొలుగొండ : గొలుగొండ మండల తహశీల్దార్ వెంకటేశ్వరరావు తన కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం బియ్యం సరఫరా చేయడంపై విఆర్వోలు, గ్రామాల్లో వాహనాల డ్రైవర్లుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన ఇంటింటా సరుకులు ప్రజలకు పంపిణీ చేయడం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# నాతవరంలో జాతీయ ఓటరు దినోత్సవంపై ర్యాలీ

నాతవరం : ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేయడానికి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్నట్లు నాతవరం తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నాతవరంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటు ద్వారా ప్రజలు తమ నచ్చినవారిని ప్రజలకు ఎన్నుకునే స్వేచ్ఛ ఉంటుందన్నారు. ఓటు హక్కుపై గ్రామస్థాయి అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు.



# మంచి నాయకుల ఎంపికతో సామాజిక అభివృద్ధి

## సంయుక్త కలెక్టర్ సుమీత్ కుమార్




శ్రీకాకుళం : మంచి నాయకుల ఎంపిక ద్వారా సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుందని సంయుక్త కలెక్టర్ సుమీత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం బాపూజీ కళామందిరంలో 11వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఎన్నికల ప్రక్రియగా అభివర్ణించారు. సమాజంలో సమస్యలను పరిష్కరించుకుని మంచి పాలనను పొందే అవకాశం కేవలం ఓటింగ్ ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. గ్రామాలలోను, పట్టణాలలోను నెలకొన్న సమస్యలను పరిష్కరించే వారెవరు అనేది ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించే సరైన వారినే నాయకులుగా ఎన్నుకోవాలన్నారు. 2019 సం.లో జరిగిన ఎన్నికలలో 80 శాతం ఓటింగ్ జరిగిందని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన తదుపరి ఎన్నికలను ప్రతీ 5 సం.లకు ఒక సారి విజయవంతంగా నిర్వహించుకోవడం జరుగుతున్నదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతీ ఓటుకు ఎంతో విలువ వున్నదన్నారు. కావున సామాజిక అభివృద్ధికి తోడ్పడే వారినే నాయకులుగా ఎన్నుకోవాలన్నారు. కావున ఎలక్షన్ అనేది మంచి పాలనను అందించే నాయకులను ఎన్నుకునే ఒక పండుగ అని అన్నారు. పౌరులు సమస్యలపైన, సమాజంపైన బాధ్యతతో వుండాలన్నారు. ప్రస్తుతం సాంకేతికతను వుపయోగించుకుని ఎన్నికలను నిర్వహించుకోవడం జరుగు తున్నదన్నారు. మన ఊరు, మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడానికి యువత పాత్ర కీలకమన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఓటును సద్వినియోగపరచుకుని, మంచి నాయకులను ఎన్నుకోవాలని అన్నారు. దేశాన్ని పటిష్టవంతంగా రూపొందించాలని పిలుపునిచ్చారు. 18 సం.లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసు కోవాలని, నిష్పక్షపాతంగా ఓటు వేయాలని దేశాభివృద్ధికి పాటు పడాలని చెప్పారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరి జీవితంలోను సుమారు 10 నుండి 12 సార్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం వస్తుందని అన్నారు. కావున ఓటింగ్ ప్రక్రియలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని తెలిపారు. ముందుగా డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైనది. ఓటింగ్ పై ప్రతిజ్ఞ, గోడపత్రిక ఆవిష్కరణ చేసారు. వ్యాస రచనపోటీలు, రంగవల్లుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. స్వాతీ సోమనాథ్, శివకుమార్ల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఓటింగ్ నమోదుపై లఘునాటికలు జరిగాయి. ఎక్కువ సార్లు ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ సిటిజెన్స్ జి.నాగేశ్వరరావు, ఎం.చంద్రమౌళీశ్వరరావు, యు.శ్రీరామ్, మల్లేశ్వరరావు, సత్యన్నారాయణ లకు సన్మానం చేసారు.

నూతన ఓటర్లకు ఓటరు కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఎం. నవీన్, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, డా.అంబేద్కర్ విశ్వవిద్యాలయం డి.ఓ.ఎ. జి.తులసీరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి ఐ.కిశోర్, రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జగన్మోహన్ రావు, శివానీ కాలేజి డైరక్టర్ డి.వెంకటరావు, సన్ డిగ్రీ కలేజీ డైరక్టర్ జయరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు అమూల్యమైనది

## మండల తహశీల్దార్ శ్రీదేవి




పెద్దాపురం : ప్రజాస్వామ్యంలో ఓటు అమూల్యమైనదని మండల తహశీల్దార్ బి.శ్రీదేవి తెలిపారు. సోమవారం పెద్దాపురం పట్టణంలో 11 వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. స్థానిక రామారావు పేటలో ఉన్న బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తహశీల్దార్ బి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశమైన మన భారత దేశంలో ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ప్రజలే ఎన్నుకుంటారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పక ఓటును నమోదు చేసుకోవాలని తెలిపారు. సమర్ధవంతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రజలకు ఓటే ప్రధాన ఆయుధమని అన్నారు. ఓటు నమోదులో అనేక సాంకేతికమైన మార్పులు తీసుకువచ్చి ఓటు నమోదు ప్రక్రియను ఎన్నికల కమిషన్ సులభతరం చేసిందని తెలిపారు. ఈ సంవత్సరం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని సెల్ ఫోన్ ఈ-ఎపిక్ కార్డు డౌన్లోడ్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చిందని, దీనిపై ఓటర్లను చైతన్య పరుస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర మాట్లాడుతూ 2011 నుండి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లను చైతన్య పరచడానికి జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ఓటు హక్కును కలిగి ఉన్న ప్రతీ ఒక్కరూ తనకు ఓటు ఉందని గర్వంగా చెప్పుకోవాలని, కాబట్టి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని తెలిపారు. ఓటు హక్కు వినియోగంలో 65 శాతం మాత్రమే వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాలాజీ మాట్లాడుతూ ఓటును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యానికి పెద్ద పీట వేసినట్లని తెలిపారు. కొంత మంది యువత ఓటరు నమోదులో అశ్రద్ధ కనబరుస్తున్నారని, దీనిని అధిగమించి ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఓటర్లయిన సర్వేశ్వర రావు, సత్యవతి, యువ ఓటరు మహేంద్రలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముందు ప్లకార్డులు, స్లోగన్ లతో జాతీయ ఓటరు దినోత్సవం ర్యాలీ, మున్సిపల్ సెంటర్ లో మానవహారం, ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి శ్రీనివాస్, టిపిఎస్ ఉమా మహేశ్వరరావు, ఎమ్ ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ లెక్చరర్ సూర్యనారాయణ, ఆర్ఐ రాఘవ, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పండుగలా పట్టాలు పంపిణీ



అనకాపల్లి : దేశ చరిత్రలో నిరుపేదలుకు సొంతంటికలను నిజము చేసిన ఘనత సిఎం జగన్ మోహన్ రెడ్డికి దక్కితుందిఅని వైసిపి పార్లమెంట్ పరిశీలికులు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం 80వ వార్డుపరిది పల్లపు వీదివద్ద 19, 22, 23 సచివాలయంలో ఇల్లు కోసము దరఖాస్తుకున్న అర్హులైన లబ్దిదారులుకు ఇండ్లు మంజూరు పట్టాలు పంపిణీ కార్యక్రమం అవార్డు వైసిపి ఇంచార్జి కొణతాల బాష్కర్ అధ్యక్షతన అదికార్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రత్నాకర్ ,జయవీర్ పాల్గోనీ 80వ వార్డు కార్పోరేటర్ అభ్యర్ది నీలిమతో కలిసి వీరు అర్హులైన 680మంది నిరుపేదల మహిళలుకు ఇండ్లుపట్టాలు అందజేసారు.అనంతరము దాడి రత్నాకర్ మాట్లడుతూ ఇచ్చినమాట నెరవేర్చడములో సిఎం జగన్ మోహన్ రెడ్డికి సాటి ఎవ్వరూ లేరు అని ఈసందర్భంగా అయన అన్నారు. యువ నాయకులు దాడి జయవీర్ మాట్లడుతూ నిరుపేదల సొంతంటి కల వైసిపి ప్రభుత్వముతోనే సాద్యమనీ అన్నారు. ఈ కార్య్ర కమంలో వైసిపి నాయకులు కొణతాల మురళి,నర్సింగ్ రావు, కెఎం నాయుడు తదితర్లు పాల్గోన్నారు.

# నిజమైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ళు కేటాయించాలి



విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గ నాయకులు జివిఎంసి ఉప కమిషనర్ ఆశాజ్యోతికి టిడ్కో ఇళ్ళు నియామకంలో జరిగిన అవకతవకలు పై విచారణ జరిపి నిజమైన లబ్ది దారులకు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు పేదలకు టిడ్కో నిర్మించి ఇచ్చామని, నియోజకవర్గంలో ఉన్న పేదలకు బ్లాక్ నంబర్లు తో సహా కేటాయించా మని, మా ప్రభుత్వం అధికారం కోల్పోయాక అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తిడ్కో ఇళ్ల కేటాయింపులో అవకతవకలు కు పాల్పడిందని అన్నారు. తక్షణమే నిజమైన లబ్ధిదారులకు ఇల్లు కేటాయింపు చేయాలని కమీషనర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో...

డాక్టర్ విల్లురి చక్రవర్తి. దొడ్డి రామానంద్. ఎర్నాకులం జగదీష్. ఆరేటి మహేష్. పొడుగు కుమార్. బుచ్చ రామ్ రెడ్డి.సీఎం రమణ. బుట్టా పరదేశి యాదవ్. గాన గళ్ల సత్య. చిన్న. లక్ష్మీ శ్రీ ప్రసాద్. పెద్దడ పైడ్రాజు. సురేంద్ర.తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా

# ఓటరు దినోత్సవ వేడుకలు

కొయ్యూరు : మండలంలో రాజేంద్రపాలెం సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది కలిసి జాతీయ ఓటరు దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజేంద్రపాలెం ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో ముగ్గులతో అలరించారు. అందులో ఓటు విలువ తెలిసేలా ముగ్గులు వేశారు. ప్రతి ఒక్కరు విధిగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలని, సచివాలయ సిబ్బంది రాజబాబు తెలిపారు. ఎట్టకేలకు 11వ ఓటరు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫణీంద్ర, ఆర్.సత్యనారాయణ, తో పాటు వాలంటరీలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీపీసీ సింహాద్రి స్పోర్ట్స్ కౌన్సిల్ వాక్‌థాన్



పరవాడ : నేషనల్ దర్మల్ పవర్ కార్పోరేషన్ (ఎన్టీపిసి)సింహాద్రి స్పోర్ట్స్ కౌన్సిల్ అద్వర్యంలో వాక్ ధాన్ ఘనంగా నిర్వహంచారు. దీపాంజలి టౌన్ షిఫ్ కుచెందిన సాధన క్రీడా మైదానంలో నిర్వహించిన2.5కె,5కె,10కెవాక్ దాన్ ను ప్రారం భించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిజిఎం ఏ.కె, శ్రీవాత్సవ హజరై అయన చేతులు మీదగా ప్రారంభించారు. అనంతరము వక్తలు మాట్లడుతూ క్రీడలు మానశిక ఉల్లాసముతో పాటు శారీరదృడత్వాన్ని పెంపోదించుకోవడానికి తోడ్పడుతాయనీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జీనా,ప్రసాద్ అద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది తథితరాలు పాల్గోన్నారు.

# గ్రీవియన్స్ సెల్ ఫిర్యాదులకు సత్వర న్యాయం

## విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్.,



విజయనగరం : జిల్లా ఎస్పీని కలవడానికి జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేసిన ఫిర్యాదుదారులను విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్., జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ, ఫిర్యాదుదారులు చెప్పిన గ్రీవియన్స్‌ను శ్రద్ధగా విని, వాటిని పరిష్కరించేందకు సంబంధిత పోలీసు అధికారులతో నేరుగా ఫోనులో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలపై వెంటనే విచారణ జరిపి, న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి 26 ఫిర్యాదులను స్వీకరించారు. కొన్ని ఫిర్యాదుల వివరాలు. విజయనగరం, దాసన్నపేట, నవాబ్‌పేటకు చెందిన కె.కిరణ్ ఫిర్యాదు చేస్తూ తన తాతగారికి వారసత్వంగా వచ్చిన 10 సెంట్లు భూమిని ఆక్రమించుకని, లేఔట్ వేసిఉన్నారని, తన భూమి తనకు ఇప్పించి, తనకు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా ఎస్పీవిచారణ జరిపి, న్యాయం చేయాల్సిందిగా విజయనగరం ఎస్.హెచ్.ఒను ఆదేశించారు. ఎల్.కోట మండలం, రంగాపురం పంచాయితీ, కూర్మవరం గ్రామానికి చెందిన కె.అప్పయ్య ఫిర్యాదు చేస్తూ తనకు ఎస్.కోట మండలం, తలారి గ్రామ పరిధిలో వారసత్వంగా వచ్చిన 79 సెంట్లు భూమి కలదని, సదరు భూమిలో 10 సెంట్లు భూమిని, మాదండు కూర్మవరం గ్రామానికి చెందిన డి.నాయుడు, పుష్పలు దౌర్జన్యం చేసి ఆక్రమణకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి, న్యాయం చేయాల్సిందిగా ఎల్.కోట ఎస్ఐని ఆదేశించారు.

పార్వతీపురం మండలం, బందలుప్పి గ్రామానికి చెందిన ఒకామె ఫిర్యాదు చేస్తూ తనకు 3 సం॥లు క్రితం వివాహం జరిగిందని, తన భర్తలేని సమయంలో, తన ఆడపడుచులిద్దరూ కట్నంకోసం వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి, న్యాయం చేయాల్సిందిగా సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. రామబద్రపురం మండలం, ఆరికతోట గ్రామానికి చెందిన ఒకామె ఫిర్యాదు చేస్తూ అదే గ్రామానికి చెందిన, తన బంధువు తన పై లైంగికంగా, భౌతికంగా దాడికి పాల్పటినట్లు, సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి, న్యాయం చేయాల్సిందిగా రామబద్రపురం ఎస్ఐని ఆదేశించారు. ఎస్.కోట మండలం, పాత ఆలుగుబిల్లి గ్రామానికి చెందిన ఒకామె ఫిర్యాదు చూస్తూ ఎస్.కోటకు చెందిన ఆర్.సన్యాసిదేముడు తమకు చెందిన ఇంటిస్థలమును ఆక్రమించుకొని, తనతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి, న్యాయం చేయాల్సిందిగా ఎస్.కోట ఎస్ఐని ఆదేశించారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ స్వయంగా ఫోనులో మాట్లాడి, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే తనకు నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ బి. రాజకుమారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి సిఐ బి.వెంకటరావు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కు సన్మానం

భీమునిపట్నం : అఖిల భారత పద్మశాలి సంఘం , కోస్తా ఆంధ్రా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో విజయవాడ మాకినేని బసవ పున్నయ్య భవనం లో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగినట్లు అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ కొప్పల రమేష్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆయన పద్మశాలీ సంఘం తరుపున ఎన్నో సేవలు అందించారనీ, ఆయన సేవలను గుర్తించి ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు సుంకురువార్ శ్రీధర్, పద్మశాలి కార్పోరేషన్ ఛైర్ పర్సన్ జింక విజయ లక్ష్మి, కోస్తా ఆంధ్రా పద్మశాలి సంఘం అధ్యక్షుడు జివి.నాగేశ్వరావు, పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ మెంబర్ కొడిదాసు శ్రీనివాస్, కోస్తా ఆంధ్రా పద్మశాలి సంఘం మహిళ అధ్యక్షురాలు కాకి కళ్యాణి, మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగోకిరి రోడ్డు కష్టాలు తీర్చిన

# గ్రామ దత్తత పుత్రుడు మురళీకృష్ణ

కొయ్యూరు : కొయ్యూరు మండలం కొండగోకిరి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు అనేది పూర్తిగా పాడైపోయింది. దీనిపై అనేక సార్లు గోకిరి గ్రామాన్ని దత్తత తీసుకున్న మురళీకృష్ణ అనేక సార్లు పంచాయతీ సెక్రటరీలకు చెప్పినా పట్టించుకోలేదు. రైతులు పండించిన పంటను ఇంటికి తీసుకురావడానికి కూడా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అయిన పంచాయతీ అధికారులు లెక్కలేనితనంతో వ్యవహరిస్తున్నారు. దీనిపై ఆగ్రహంతో ఉన్న రైతులు, గ్రామస్థులు గ్రామాన్ని దత్తత తీసుకున్న మురళీకృష్ణ ఆర్థికసహాయంతో రోడ్డు నిర్మాణంను గ్రీన్ విలేజ్ యూత్ సభ్యుల నుండి దీనిని చేపట్టారు. దీనిపై రైతులు, గ్రామస్థులు మురళీకృష్ణకు యూత్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

# ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు





విశాఖపట్నం : పిల్లలు నిరంతరం శ్రమించాలని, అలసత్వానికి తావు ఇవ్వరాదని, దేశం కోసం ఆలోచించాలని, ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కోరారు. సోమవారం నాడు ఆయన న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో 32 మంది బాలబాలికలకు " ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు - 2021" అందజేశారు. ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందజేసే ఈ పురస్కారాలను, కోవిడ్ నేపథ్యంలో ఈసారి వర్చువల్ గా ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతీ ఇరానీ కూడా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖ జిల్లాకు చెందిన " అమేయ లగుడు " ఈ అవార్డుకు ఎంపికైంది.

12 సంవత్సరాల ఈ బాలిక కళలు మరియు సంస్కృతి కేటగిరీలో ఎంపికకాబడ్డారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు, ఐసీడీఎస్ పీడీ సీతామహాలక్ష్మి, అవార్డు గ్రహీత అమేయ లగుడు, తల్లిదండ్రులు కమల, మూర్తులు పాల్గొన్నారు.







# నూటికి నూరుశాతం విజయం మాదే



*అమరావతి: పంచాయతీ ఎన్నికలపై సుప్రీంకోర్టు తీర్పును శిరసావహిస్తామని ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గ్రామాల్లో ఏకగ్రీవాలు ఎప్పటి నుంచో జరుగుతూ వస్తున్నాయని చెప్పారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో నూటికి నూరుశాతం తమదే విజయమని బొత్స ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ఇబ్బంది రాకూడదనేదే తమ అభిప్రాయమన్నారు. కరోనా జాగ్రత్తలు తీసుకుంటూ ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. ఎన్నికలంటే భయం లేదని.. ఎవరో వచ్చి తమ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. ఎవరేం చేసినా అంతిమంగా ప్రజలే న్యాయ నిర్ణేతలని చెప్పారు.*

# సుస్థిర నిర్మాణాలను జరపాలి

## రెండు వారాల ఎఫ్‌డిపిలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : పటిష్టమైన సుస్థిర నిర్మాణాలను జరపాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఏఐసిటిఇ సంయుక్తంగా 'షాలో అండ్ డీప్ ఫౌండేషన్' అంశంపై నిర్వహిస్తున్న రెండు వారాల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆయన ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో బహుళ అంస్థుల భవనాల నిర్మిణం, బ్రిడ్జీలు, ఫ్లైఓవర్‌లు నిర్మాణాలు పెరిగాయన్నారు. వీటి నిర్మాణంలో నేల స్వభావాన్ని పరిక్షించే సాంకేతిక విధానాలు కలిగి ఉండటం, తదునుగుణంగా అవసరమైన ఫౌండేషన్ (పునాది)ని వేసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఎంతో ఖ్యాతి గాంచిందని, షాలో, డీప్ ఫౌండేషన్‌ల నిర్మాణంలో వీరి నిపుణతను ఉపయోగించుకోవాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య టి.వి ప్రవీణ్ మాట్లాడుతూ అధ్యాపకులు, ఆచార్యుల బోధన పటిమను, జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవడానికి ఎఫ్‌డిపి ఉపకరిస్తుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, ఐఐటి గాంధీనగర్ ఎమిరిటస్ ప్రొఫిసర్ ఆచార్య జి.వి రావు, ఆచార్య కె.ఎస్ బీన తదితరులు ప్రసంగించారు. రెండు వారాల ఎఫ్‌డిపిలో భాగంగా విశిష్ట ఆచార్యుల ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నట్లు సదస్సు సమన్వయకర్త ఆచార్య సి.ఎన్.వి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఎఫ్‌డిపిలో 120 మంది అధ్యాపకులు, ఇంజనీర్లు, పరిశోధకులు దేశం నలుమూలల నుంచి పాల్గొంటున్నారన్నారు.

# కోర్టు కేసులకు కౌంటర్లు త్వరగా ఇవ్వాలి

## విఎంఆర్డిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు





విశాఖపట్నం : వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయం లో సోమవారం జరిగిన పరిపాలనా, ప్రణాళికా, ఎస్టేట్, సాంకేతిక మరియు న్యాయవిభాగపు సమీక్షా సమావేశంలో విభాగాల వారీగా అపరిష్కృతంగా ఉన్న లీగల్ కేసుల వివరాలను క్షేత్రస్థాయి లో సమీక్షించిన మెట్రోపాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, మరియు అదనపు మెట్రోపాలిటన్ కమిషనర్ మనాజీర్ జిలానీ సామూన్, విఎంఆర్డిఏ కార్యదర్శి గణేష్ కుమార్ నూతనంగా ఐఏఎస్‌కి ఎంపికైన సందర్భంగా పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలియజేశారు. అనంతరం విభాగాధిపతులతో మాట్లాడుతూ... విభాగాల్లో సిబ్బంది వద్ద అంతర్గతంగా ఎన్నెన్ని అపరిష్కృత న్యాయ కేసులు పెండింగ్ ఉన్నాయో లెక్క తేల్చి వాటన్నింటికి పక్షం రోజుల్లోగా కౌంటర్లు ఎట్టి పరిస్థితుల్లో దాఖలు చేసి తీరాలని అధికారులను ఆదేశించారు. అలసత్వం కనబరిచే సిబ్బందిపై తగు చర్యలు తీసుకొనబడుతాయన్నారు. తదుపరి ప్రణాళిక విభాగపు సమీక్షలో విఎంఆర్డిఏ సంస్థకు ఎల్ఆర్ఎస్- 2020 పథకం ద్వారా అందిన దరఖాస్తుల యాజమాన్యపు హక్కులను క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మటే ఆమోదించే దిశగా చర్యలు తీసుకోవాలని తద్వారా న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా చూసుకోవాలని ప్రణాళిక విభాగపు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో కార్యదర్శి గణేష్ కుమార్, ప్రధాన ఇంజనీర్ రామ్మోహన్ రావు, ఛీఫ్ అర్బన్ ప్లానర్ సురేష్ కుమార్, భూసేకరణ తహసీల్దార్ తారకేశ్వరి, ప్రణాళిక అధికారులు, పరిపాలనా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలి

## - ఉత్తర సమన్వయకర్త కె కె రాజు



మురళి నగర్: 50 వార్డు మురళీనగర్ శ్రీదేవి పార్క్ లో కీర్తి పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ కరోన మహా విపత్తులో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న అనేక కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేయటమే కాకుండా అన్ని రకాలుగా చాలా ముందుకు వచ్చి ప్రజలను ఆదుకున్నారని అలాగే అనేక సేవలు అందించి ప్రజలను ఆదుకున్నారని, ప్రతీ ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ 4 కమిషనర్ సింహాచలం గారు, 50వార్డు అభ్యర్థి వావిళ్ళపల్లి ప్రసాద్, మంత్రి రాజశేఖర్, నంబాల ఈశ్వరరావు, రాము, కృష్ణా రావు మాస్టర్, ఎం. లక్ష్మి, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ భద్రతా వలయంలో 'దిల్లీ నగరం'

దిల్లీ: దిల్లీ పోలీసులకు మంగళవారం ఓ పెద్ద సవాల్‌గా మారింది. ఓ వైపు రిపబ్లిక్ డే వేడుకలు.. మరోవైపు, రైతు సంఘాలు తలపెట్టిన భారీ ట్రాక్టర్ పరేడ్.. దీంతో దేశ రాజధానిలో ఎటు చూసినా పోలీసులే..! ఈ రెండు ఈవెంట్లు ఒక్కరోజే ఉండటంతో అప్రమత్తమైన పోలీసులు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. రాజ్‌పథ్ వద్ద మంగళవారం జరిగే రిపబ్లిక్ డే వేడుకల కోసం 6వేల మంది భద్రతా సిబ్బందిని రంగంలోకి దించారు.

అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు వింటేజ్ పాయింట్లలో ఫేషియల్ రికగ్నేషన్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. అలాగే, రాజ్‌ఘాట్ వద్ద చురుకైన సిబ్బందిని పీపీఈ కిట్లు, మాస్క్, ఫేష్ షీల్డ్‌లతో మోహరిస్తున్నామని తెలిపారు.

రాజ్‌పథ్ నుంచి కవాతు జరిగే దాదాపు 8 కి.మీల మార్గంలో నిఘా ఉంచేందుకు వీలుగా ఎత్తైన భవనాలపై షార్ప్‌షూటర్లు, స్నైపర్స్ గస్తీ కాస్తారన్నారు. దిల్లీ చుట్టూ సరిహద్దు ప్రాంతాల వద్ద ఐదంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

# కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ లో మొదటిరోజు కోవిడ్ వ్యాక్సినేషన్ విజయవంతం



విశాఖపట్నం : ప్రపంచ దేశాలన్ని ఘడఘడలాడించిన కోవిడ్-19ని అరికట్టే వ్యాక్సిన్ వచ్చేసింది. ఈ మేరకు వైజాగ్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో వ్యాక్సినేషన్ విజయవంతంగా ప్రారంభించారు. మొదటి రోజు వాక్సినేషన్ లో భాగంగా దాదాపు 50 మంది వైద్య, వైద్యేతర సిబ్బందికి వాక్సినేషన్ చెయ్యడం జరిగింది. 9 రోజులపాటు జరగబోయే ఈ వాక్సినేషన్ కార్యక్రమానికి అన్నిరకాల ఏర్పాట్లు చేయడం జరిగింది. ప్రతి రోజు వంద మందికి చొప్పున 9 రోజులపాటు ఈ వాక్సినేషన్ చెయ్యనున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు ఈ వ్యాక్సిన్ ఇవ్వనున్నారు. వ్యాక్సిన్ వేసిన అనంతరం వారిని దాదాపు ఒక గంట పాటు వారిని ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచనున్నారు. ఇవాళ వ్యాక్సిన్ వేసుకున్న వారి నుండి ఎటువంటి ఇబ్బందులు రాలేదని, వ్యాక్సిన్ వేసుకోవాడానికి తగిన గుర్తింపు కార్డులు చూపించాలని ప్రభుత్వ ఆశ వర్కర్లు తెలిపారు.

# సింహాచల దేవస్థానం అభివృద్ధి, ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలి

- అప్పన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా స్వీయ పర్యవేక్షణ కల్పించండి
- ఉప దేవాలయాల అభివృద్ధికి కృషి చేయండి
- నూతన ఈ.ఓ గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ బొగ్గు శ్రీను



సింహాచలం: వేల సంవత్సరాల చరిత్ర కలిగిన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ అభివృద్ధికి, అప్పన్న ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని సింహాచలం దేవస్థానం నూతన ఈఓ గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావుకు సంఘసేవకుడు, జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు డాక్టర్ బొగ్గు శ్రీను కోరారు. సింహాచలంలోని ఈవో కార్యాలయంలో నూతన ఈవో వెంకటేశ్వరరావును బొగ్గు శ్రీను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొగ్గు శ్రీను మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు దుష్ట(రాజకీయ) శక్తుల వలన అపాయం పొంచి ఉందని హిందూ ధర్మాన్ని నాశనం చేసేందుకు అన్ని పార్టీలు స్వార్థ రాజకీయాలు చేస్తున్నాయని తెలియజేశారు. దేవుని వద్దఅన్ని వర్గాలు సమానమేనని ముఖ్యంగా అప్పన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కార్యనిర్వహణాధికారి స్వీయ పర్యవేక్షణలో పరిపాలన సాగాలని కోరారు. అలాగే సింహాచల దేవస్థానానికి సంబంధించి జిల్లాలో ఎన్నో ఉప దేవాలయాలు ఉన్నాయని ఆ దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సింహాచలం పరిసర ప్రాంతాల్లో అన్యమత ప్రచారం జరగకుండా ప్రత్యేక టాస్కోఫర్సు ఏర్పాటు చేయాలని బొగ్గు శ్రీను కోరారు.

# రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనాలు ప్రారంభం



ములగాడ : ప్రజా పంపిణీ వ్యవస్థలో కనీవినీ ఎరుగని రీతిలో సరికొత్త రికార్డు సృష్టిస్తూ.. పేదల గడప వద్దకే వెళ్లి సరుకులు చేరవేసేలా నూతన ఒరవడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని విశాఖ పశ్చిమ వైకాపా ఇంచార్జ్ డాక్టర్ మళ్ళా విజయ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జింక్ ఆంజనేయ స్వామి ఆలయ సమీపం వద్దనుంచి ప్రజలు ఇంటి వద్దకే బియ్యం పంపిణీ వాహనాలు ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మళ్ళా మాట్లాడుతూ రేషన్ సరుకుల కోసం రోజువారీ కూలీలు, వృద్ధులు, రోగులు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి వేచి చూడకుండా వచ్చే నెల నుండి వారి ఇంటికే చేరనున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఇంటికీ రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనం ద్వార అందించాలని డిపోలకు వెళ్లి పడికాపులు పడకుండ కష్టాలు పడకుండా ఇంటికొచ్చే విధానాన్ని తీసుకొస్తూ రేషన్ డోర్ డెలివర్ వాహనాలు పథకం ప్రజలకు అందించడం ఆనంద దాయకమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి వచ్చిన అనతికాలంలోనే ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని ,ఆంధ్ర రాష్ట్రాన్ని సంక్షేమ పథకంలో ఉంచడంలో అగ్రగామిగా ముఖ్య మంత్రి నిలిచారన్నారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు పుర్రి సురేష్ యాదవ్, పి వి సురేష్ ,పూడి మల్లేష్, అంగ వర్మ, గులిగిందల క్రిష్ణ దాడి సత్యనారాయణ (కోట), అధిక సంఖ్యలో మహిళలు వాలంటీర్లు స్థానికులు లబ్ధిదారులు,వైకాపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లో మద్యం ఉంచుకుంటే లైసెన్స్ తప్పనిసరి

లఖ్‌నవూ: ఉత్తర ప్రదేశ్‌లోని ఆదిత్యనాథ్ ప్రభుత్వం మద్యం విక్రయాలతో వచ్చే ఆదాయంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిమితికి మించి ఇంట్లో మద్యాన్ని నిల్వ చేసుకుంటే అందుకు లైసెన్స్‌ను తప్పనిసరి చేసింది. ఇంట్లో 6 లీటర్ల కంటే అధిక మద్యం ఉంచుకుంటే అందుకు లైసెన్స్ తీసుకోవాలని ఎక్సైజ్ విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి సంజయ్ ఆర్.భూస్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో అమలుచేసిన నూతన ఎక్సైజ్ విధానం ప్రకారం.. 6 లీటర్ల కంటే అధిక మద్యాన్ని నిల్వ చేసుకుంటే ప్రతి సంవత్సరం రూ.12 వేల లైసెన్స్ ఫీజు, రూ.51 వేల సెక్యూరిటీ మొత్తాన్ని జమ చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. పరిమితికి మించి మద్యం కొనుగోళ్లకు, రవాణా చేసేందుకు కూడా సదరు లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. నిర్దేశించిన పరిమితి కంటే మద్యం సేవించేందుకు కూడా ఈ లైసెన్స్ పొందడం తప్పనిసరి చేసింది. రాష్ట్రంలో మద్యం విక్రయాల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి రూ.28,340 కోట్ల ఆదాయం లభించింది. నూతన ఎక్సైజ్ విధానాలతో కలిపి 2021-22లో రూ.34,500 కోట్లు రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com